5 DOTS NETWORK

ప్రభాత కిరణము

సత్యానికి వారధి

PRGI REGD No.: TGTEL/26/A4986

5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 001 | గురువారం | 25-06-2026 | పేజీలు : 06 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajgiri | Volume : 01 | Issue : 001 | Thursday | 25-06-2025 | Pages: 06 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri




# సర్ యుద్ధం

- ఎందుకు? ఏమిటి? ఎలా?
- ప్రత్యేక సవరణ కార్యక్రమం
- లాభం ఎవరికి? నష్టం ఎవరికి?
- ఓటరు ప్రక్షాళనతో కొత్త చిక్కులు
- ఓటు హక్కు రక్షణ కోసం పోరాటం
- జాబితా ప్రక్షాళనకు రంగం సిద్ధం

రాష్ట్రంలో నేటి నుంచి జరగనున్న ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) ప్రక్రియ సామాన్య ఓటరుకు ఒక పెద్ద పరీక్షగా మారింది. ఓటరు జాబితాను శుభ్రం చేయాలనే ప్రభుత్వ సంకల్పం మంచిదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇది అనేక ఆందోళనలకు దారితీస్తోంది. దశాబ్దాల క్రితం నాటి పాత రికార్డులను వెలికితీయడం, నిరక్షరాస్యులైన ప్రజలు వెబ్‌సైట్లలో తమ వివరాలను శోధించడం ఒక ప్రహసనంగా మారింది. ముఖ్యంగా అద్దె ఇళ్లలో ఉంటూ తరచూ నివాసాలు మార్చే సామాన్యులు, వలస కార్మికులు ఈ నిబంధనల వల్ల తమ ఓటు హక్కును కోల్పోతామేమోననే భయాందోళనల్లో ఉన్నారు. మరోవైపు, ఈ విధానం వల్ల సామాన్యుడి దైనందిన జీవితంలో ఒక రకమైన మానసిక సంఘర్షణ మొదలైంది. ప్రభుత్వ రికార్డుల్లో దొర్లిన తప్పుల వల్ల ఒకే కుటుంబంలో వయస్సు వ్యత్యాసాలు విపరీతంగా చూపించడం గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఈ తప్పులను సరిదిద్దుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాలా లేక కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలా అనే స్పష్టత లేకపోవడం ప్రజలను తీవ్ర అయోమయానికి గురిచేస్తోంది. ఓటు హక్కును కాపాడుకునే క్రమంలో సామాన్యుడు ఎదుర్కొంటున్న ఈ ఆటంకాలు ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక సవాలుగా నిలుస్తున్నాయి.

## సర్ విషయంలో బీకేర్ ఫుల్

- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించం
- అప్రమత్తంగా ఉండండి.. • పనిచేయని వారిని వదులుకుంటాం
- బాధ్యత లేని నాయకులను తప్పించేస్తాం
- సర్‌తో బీజేపీ రాజకీయ కుట్రలు • సీఎం రేవంత్ ఘాటు హెచ్చరిక

## సర్ బూచి.. రేషన్ నిరాకరణ

బెంగాల్ సర్కార్ నిర్ణయంపై సుప్రీంకోర్టు విస్మయం




# రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు



» కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
» కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాష్ట్రం ఆగం
» సత్తుపల్లి పర్యటనలో కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక రెగ్యులర్ సీఎం కాదని, కేవలం ఢిల్లీ దయతో నడుస్తున్న రెన్యువల్ సీఎం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన బుధవారం పలు రాజకీయ పరిణామాలపై మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం వెనుకబడుతుందని కేసీఆర్ ముందే హెచ్చరించారని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి కేవలం ఏడు నెలల కాలంలోనే 72 సార్లు ఢిల్లీ పర్యటనలు చేశారని, దీనివల్ల రాష్ట్రానికి ఒరిగిన ప్రయోజనం ఏమీ లేదని ఆయన విమర్శించారు.

(వివరాలు 2లో..)

## జల ద్రోహం

### తెలంగాణ నీటి హక్కుల రక్షణకు పోరాటం

### సీఎం రేవంత్‌కు హరీశ్ రావు ఘాటు లేఖ

తుంగభద్ర జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను తక్షణమే అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత సమైక్య పాలనలో జరిగిన నీళ్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న తెలంగాణలో, ఇప్పుడు మళ్లీ జల హక్కులను కాపాడుకోవడానికి సిద్ధం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

(వివరాలు 2లో..)





# ప్రకృతి ప్రకోపం

- దేశవ్యాప్తంగా వర్షాలు
- ముంబైని ముంచెత్తిన వానలు

దేశంలో రుతుపవనాల ఆగమనం తీవ్ర రూపం దాల్చింది. దేశంలోని పలు రాష్ట్రాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్ నుండి పశ్చిమ తీరంలోని ముంబై మహానగరం వరకు వానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల కారణంగా నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడంతో అటు ప్రజలు, ఇటు ప్రభుత్వ యంత్రాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

(వివరాలు 2లో..)


## రాష్ట్రాన్ని కమ్మేసిన నైరుతి

- తెలంగాణకు భారీ వర్ష సూచన
- వారం పాటు వానల హెచ్చరిక
- హైదరాబాద్‌లోనూ జోరుగా వానలు

తెలంగాణ అంతటా నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఎదురుచూసిన వర్షాలు ప్రారంభం కావడంతో ప్రజల్లో ఊరట కనిపిస్తోంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే వారం రోజుల పాటు పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. (వివరాలు 2లో..)

# జల విద్యుత్ రంగంలో కొత్త విప్లవం

- ఇండియాకు సవాలుగా చైనా వ్యూహాలు
- గ్లోబల్ హైడ్రో పవర్ రిపోర్ట్ సంచలనం



ప్రపంచవ్యాప్తంగా జలవిద్యుత్ రంగం ఇప్పుడు సరికొత్త పుంతలు తొక్కుతోంది. సాంప్రదాయ జలవిద్యుత్ స్థానంలో 'వాటర్ బ్యాటరీ'గా పిలిచే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత పెరుగుతోంది. తాజాగా విడుదలైన 2026 గ్లోబల్ హైడ్రోపవర్ అవుట్‌లుక్ నివేదిక ప్రకారం, ఈ రంగంలో చైనా తన ఆధిపత్యాన్ని గట్టిగా చాటుకుంటోంది. చైనాలో ప్రస్తుతం 300 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుండగా, అందులో 218 గిగావాట్లు కేవలం పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులే కావడం విశేషం.

(వివరాలు 2లో..)



## బాల్క సుమన్‌కు బెయిల్

### సింగరేణి కేసులో హైకోర్టు కీలక నిర్ణయం

### జైలు నుంచి విడుదలకు మార్గం సుగమం

సింగరేణి సంస్థపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టు బుధవారం పెద్ద ఉపశమనం కలిగించింది. గత కొన్ని రోజులుగా చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను న్యాయస్థానం మంజూరు చేసింది. రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు ఇద్దరు వ్యక్తుల పూచీకత్తును సమర్పించాల్సిందిగా న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో మే 30 నుండి జైలులో ఉన్న సుమన్ విడుదలకు అధికారికంగా మార్గం సుగమమైంది. (వివరాలు 3లో..)




# విస్తుపోయే నిజాలు..

పూణే వ్యాపార వేత్త కేతన్‌ను త్వరలో పెళ్లి చేసుకోబోయే సియా గోయల్ హత్య చేసిన ఉదంతం ఇప్పుడు దేశ వ్యాప్తంగా వైరల్ అవుతోంది. కోట్లకు పడగలెత్తిన కుబేరుడ్ని పెళ్లి చేసుకుంటున్న తరుణంలో ఆయనను చంపడం ఇప్పుడు అందరినీ కలచి వేస్తోంది. పైకి ఎంతో పద్ధతిగా నటిస్తూ, ప్రాణంగా ప్రేమించే కాబోయే భర్తను ఒక యువతి దారుణంగా చంపేసింది. పూణేకు చెందిన ధనవంతుడు, వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్‌కు సియా గోయల్ అనే యువతితో నిశ్చితార్థం జరిగింది. నవంబర్‌లో రాజస్థాన్ ప్యాలెస్‌లో రూ. 17 కోట్లతో పెళ్లికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ సియా మనసులో చేతన్ చౌదరి అనే ప్రియుడు ఉన్నాడు. పెళ్లి చేసుకుంటే తమ ప్రేమకు అడ్డు వస్తాడని భావించి, కేతన్‌ను శాశ్వతంగా వదిలించుకోవాలని ఇద్దరూ కలిసి ఒక ఘోరమైన ప్లాన్ వేశారు. జూన్ 18న సియా ప్లాన్ ప్రకారం కేతన్‌ను లోహగడ్ కోటకు ట్రెకింగ్ కోసం తీసుకెళ్లింది. అక్కడ ఫోటోలకు పోజులు ఇస్తున్నట్లు నటించి, వెనుక నుంచి లోయలోకి నెట్టి చంపేసింది. మొదట కాలు జారి పడిపోయాడని పోలీసులను నమ్మించింది. కానీ కేతన్ సోదరి అనుమానంతో నిలదీయడం, పోలీసులు సీసీటీవీలు పరిశీలించడంతో అసలు నిజం బయటపడింది. తీవ్రమైన ఎండలో కూడా ముఖం దాచుకోవడానికి హుడీ జాకెట్ వేసుకుని వెంబడించిన ప్రియుడు చేతన్, సియా ఇద్దరూ కలిసి ఈ హత్య చేసినట్లు తేలింది. ప్రస్తుతం పోలీసులు నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. నమ్మి వచ్చిన వాడిని నట్టేట ముంచిన ఈ నకిలీ ప్రేమ కథ సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది.

^ ప్రత్యేక కథనాలు లోపలి పేజీల్లో..

- సినిమాను మించి స్క్రీన్ ప్లే రాసిన యువతి
- సంచలనం రేపుతున్న పూణే రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య
- కాబోయే భార్య సియా గోయల్ ఆడిన నకిలీ ప్రేమనాటకం
- ఫైవ్ స్టార్ హోటల్ వేడుకలు రద్దు చేయించి మరీ ఘాతుకం
- లోహగడ్ కోట లోయలోకి నెట్టి చంపిన కిరాతక ప్రియుడు
- ఫోటోలకు పోజులు ఇస్తుండగా ప్రమాదమంటూ అబద్ధం
- ఏడు నెలల్లో ఏకంగా రెండు వేల కాల్స్ మాట్లాడిన నిందితులు
- బాలి ఫోటోషూట్ ప్రయాణాన్ని ముందే చెడగొట్టిన యువతి
- మర్డర్ ప్లాన్ ఛేదించి హంతకులను అరెస్ట్ చేసిన పోలీసులు



## అబద్ధాల వేట

- ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సంక్షేమం
- కాంగ్రెస్ సంక్షేమ పాలనపై మంత్రుల ధీమా

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు. (వివరాలు 2లో..)

## అసలు ఆఫీస్ అంటే ఏంటి?

- పోష్ చట్టంపై హైకోర్టు కీలక తీర్పు
- మహిళల రక్షణ పరిధిపై న్యాయస్థానం స్పష్టత



మహిళల రక్షణ కోసం ఉద్దేశించిన పోష్ చట్టం పరిధిలోని 'కార్యాలయం'.. వర్క్‌ప్లేస్ అనే పదానికి బాంబే హైకోర్టు ఒక ముఖ్యమైన తీర్పులో సరికొత్త స్పష్టతనిచ్చింది. ఉద్యోగి ఆఫీసుకు వెళ్లే క్రమంలో ఉపయోగించే సాధారణ షేర్డ్ ఆటోరిక్షా చట్టం పరిధిలోకి రాదని కోర్టు స్పష్టం చేసింది. యాజమాన్యం స్వయంగా వాహన వసతి కల్పిస్తే తప్ప, పబ్లిక్ రవాణా సాధనాలను కార్యాలయంగా పరిగణించలేమని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ తీర్పు ద్వారా పని స్థలంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలు పరిధిపై ఉన్న అనేక అనుమానాలకు తెరపడింది.

(వివరాలు 2లో..




## పాకిస్తాన్‌కు గడ్డి పెట్టిన భారత్

అంతర్జాతీయ వేదికపై ఇండియా దూకుడు
జమ్మూ కాశ్మీర్ భారతదేశ అంతర్గత వ్యవహారం
స్పష్టం చేసిన భారత రాయబారి పర్వతనేని హరీష్

# అబద్ధాల వేట

- ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సంక్షేమం
- కాంగ్రెస్ సంక్షేమ పాలనపై మంత్రుల ధీమా



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### కాళేశ్వరం వైఫల్యంపై ఘాటు విమర్శలు

వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలో దాదాపు లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలతో సహా చెల్లిస్తోందని తెలిపారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు అనే నలుగురూ మాయమాటలతో రాష్ట్రంపై పడి దుష్ప్రచారాలు చేస్తున్నారని, ప్రజలు వారిని నమ్మవద్దని కోరారు.

### హామీల అమలుపై ప్రగతి నివేదిక

తాము అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను నిరంతరం నెరవేర్చుతూ వస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రస్తుతం కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. అలాగే ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నట్లు ప్రకటించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేల కోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కోసం ఇప్పటికే 13వేల కోట్ల రూపాయలు చెల్లించామని వెల్లడించారు.

### రైతు ఆశీర్వాద సభకు పిలుపు

రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసా పథకం కింద 36వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదేనని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొనియాడారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించామన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను భారీ ఎత్తున విజయవంతం చేయాలని ఇరువురు మంత్రులు పిలుపునిచ్చారు.

# జల విద్యుత్ రంగంలో కొత్త విప్లవం

- ఇండియాకు సవాలుగా చైనా వ్యూహాలు
- గ్లోబల్ హైడ్రో పవర్ రిపోర్ట్ సంచలనం



ప్రపంచవ్యాప్తంగా జలవిద్యుత్ రంగం ఇప్పుడు సరికొత్త పుంతలు తొక్కుతోంది. సాంప్రదాయ జలవిద్యుత్ స్థానంలో 'వాటర్ బ్యాటరీ'గా పిలిచే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత పెరుగుతోంది. తాజాగా విడుదలైన 2026 గ్లోబల్ హైడ్రోపవర్ అవుట్‌లుక్ నివేదిక ప్రకారం, ఈ రంగంలో చైనా తన ఆధిపత్యాన్ని గట్టిగా చాటుకుంటోంది. చైనాలో ప్రస్తుతం 300 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుండగా, అందులో 218 గిగావాట్లు కేవలం పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులే కావడం విశేషం.

### భారతదేశం భారీ లక్ష్యాలు

భారతదేశం కూడా ఈ సాంకేతికత ప్రాధాన్యతను గుర్తించి ముందుకు సాగుతోంది. వచ్చే 203536 నాటికి 100 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ జలవిద్యుత్ సామర్థ్యాన్ని అందుకోవాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర విద్యుత్ సంస్థ అంచనాల ప్రకారం, భారతదేశంలో 288 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి అపారమైన అవకాశాలు ఉన్నాయి. గత 2025 సంవత్సరంలో మధ్య, దక్షిణ ఆసియా దేశాలలో 4,267 మెగావాట్ల జలవిద్యుత్‌ను అదనంగా చేర్చి భారత్ అగ్రస్థానంలో నిలిచింది.

### చైనా ఆధిపత్యం పెరిగిన వైనం

ప్రపంచ జలవిద్యుత్ రంగంలో చైనా దూకుడు విపరీతంగా పెరిగింది. టిబెట్ ప్రాంతంలోని యార్లుంగ్ జాంగ్బో నదిపై చైనా నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్దదైన త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే మూడు రెట్లు ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలదు. ఈ నదే భారతదేశంలోకి సియాంగ్, బ్రహ్మపుత్ర నదులుగా ప్రవహిస్తుంది. చైనా వ్యూహాలకు ప్రతివ్యూహంగా భారత్ కూడా అరుణాచల్ ప్రదేశ్‌లో 11,000 మెగావాట్ల అప్పర్ సియాంగ్ మల్టీపర్పస్ ప్రాజెక్టును రక్షణ కవచంగా నిర్మించడానికి సిద్ధమవుతోంది.

### ఆసియా దేశాల్లో పెరుగుతున్న డిమాండ్

ఆసియా ఖండంలో పునరుత్పాదక ఇంధన వినియోగం, విద్యుత్ డిమాండ్ వేగంగా పెరుగుతున్నాయి. పంప్డ్ స్టోరేజ్ సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా 200 గిగావాట్ల మార్కును దాటి, అతిపెద్ద దీర్ఘకాలిక ఇంధన నిల్వ వనరుగా అవతరించింది. కేవలం ఒక సంవత్సరంలోనే ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 11.7 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ సామర్థ్యం తోడైంది. ఇంధన భద్రత, గ్రిడ్ స్థిరత్వం కోసం సౌత్ కొరియా, ఫిలిప్పీన్స్, థాయిలాండ్, వియత్నాం వంటి ఆసియా దేశాలు కూడా ఈ నీటి బ్యాటరీల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నాయి.

# ఐరాస వేదికపై పాకిస్తాన్‌కు గడ్డి పెట్టిన భారత్

- అంతర్జాతీయ వేదికపై ఇండియా దూకుడు
- జమ్మూ కాశ్మీర్ భారతదేశ అంతర్గత వ్యవహారం
- స్పష్టం చేసిన భారత రాయబారి పర్వతనేని హరీష్




ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో పాకిస్తాన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై భారతదేశం తీవ్రంగా స్పందించింది. జమ్మూ కాశ్మీర్ అంశం పూర్తిగా భారతదేశానికి సంబంధించిన అంతర్గత వ్యవహారమని ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీష్ స్పష్టం చేశారు. చైనా, పాకిస్తాన్ సంయుక్తంగా నిర్వహించిన ఒక అనధికారిక సమావేశంలో కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వేదికను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరికాదని పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పింది.

### పాక్ కుట్రలను తిప్పికొట్టిన భారత్

భద్రతా మండలి ప్రత్యేక సమావేశంలో పాకిస్తాన్ రాయబారి అసిమ్ ఇఫ్తిఖార్ అహ్మద్ ఉద్దేశపూర్వకంగా జమ్మూ కాశ్మీర్ ప్రస్తావన తీసుకువచ్చారు. దీనిపై భారత రాయబారి పర్వతనేని హరీష్ వెంటనే స్పందిస్తూ, ఈ వేదికకు అధ్యక్షత వహిస్తున్న దేశం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం విచారకరమన్నారు. జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాలు ఎప్పటికీ భారతదేశంలో అవిభాజ్య భాగాలుగానే ఉంటాయని, ఈ విషయంలో ఎవరి జోక్యాన్ని అంగీకరించబోమని తేల్చిచెప్పారు.

### కాలం చెల్లిన నిబంధనలపై సమీక్ష


ఐరాస చార్టర్‌లోని చాప్టర్ 6, చాప్టర్ 7 నిబంధనల గురించి భారత ప్రతినిధి ఈ సందర్భంగా సుదీర్ఘంగా వివరించారు. దశాబ్దాల క్రితం చేసిన కొన్ని తాత్కాలిక నిబంధనలు ఎల్లకాలం వర్తించవని ఆయన స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి, ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా పాత పద్ధతులను సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పాలస్తీనా అంశంలో కాలక్రమేణా మధ్యవర్తిత్వ చట్రాలు మారిన విషయాన్ని ఆయన ఉదాహరణగా చూపిస్తూ, పాతబడిన నిబంధనలను పట్టుకుని కూర్చోవడం తప్పవుతుందని హితవు పలికారు.

### భద్రతా మండలిలో మార్పుల కోసం డిమాండ్

ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అద్దం పట్టేలా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని భారతదేశం డిమాండ్ చేసింది. శాశ్వత సభ్యదేశాల సంఖ్యను పెంచకుండా చేసే సంస్కరణలు వ్యర్థమని పేర్కొంది. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల మద్దతు లభిస్తోంది. జీ4 కూటమిలోని బ్రెజిల్, జర్మనీ, జపాన్ దేశాలతో పాటు పలు ఐరోపా దేశాలు కూడా భారత అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తున్నాయని రాయబారి గుర్తుచేశారు.

# రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

- కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రాష్ట్రం ఆగం
- సత్తుపల్లి పర్యటనలో కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక రెగ్యులర్ సీఎం కాదని, కేవలం ఢిల్లీ దయతో నడుస్తున్న రెన్యువల్ సీఎం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన బుధవారం పలు రాజకీయ పరిణామాలపై మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం వెనుకబడుతుందని కేసీఆర్ ముందే హెచ్చరించారని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి కేవలం ఏడు నెలల కాలంలోనే 72 సార్లు ఢిల్లీ పర్యటనలు చేశారని, దీనివల్ల రాష్ట్రానికి ఒరిగిన ప్రయోజనం ఏమీ లేదని ఆయన విమర్శించారు.

### రాష్ట్రంలో పెరిగిన ప్రజల అసంతృప్తి

కాంగ్రెస్ రాకతో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఏ వర్గాన్ని వదిలిపెట్టకుండా ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. చివరకు సత్తుపల్లి స్థానిక విలేకరులకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్లు ఇచ్చి రేవంత్ ప్రభుత్వం అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రస్తుతం తెలంగాణలోని మారుమూల గ్రామాలకు వెళ్లినా కాంగ్రెస్ దుర్మార్గపు పాలన నశించాలని, మళ్లీ కేసీఆర్ నాయకత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రగతికి బలమైన పునాదులు పడ్డాయని, అభివృద్ధి తిరిగి ప్రారంభం కావాలంటే కేసీఆర్ పాలన అవసరమని ప్రజలే అంటున్నారని స్పష్టం చేశారు.

### రైతాంగం, నిరుద్యోగుల సమస్యలపై నిలదీత

రాష్ట్రంలోని అన్నదాతలకు రైతుబంధు సాయాన్ని సకాలంలో అందించకుండా కాంగ్రెస్ సర్కార్ తీవ్రంగా వేధిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. యువతకు ఉద్యోగాల కల్పనలో కూడా రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. గతంలో కేసీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని భూములను సస్యశ్యామలం చేయడానికి గోదావరి జలాలను ఒడిసిపట్టి భారీ వ్యూహాన్ని అమలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు గతంలో జలయజ్ఞం పేరుతో కేవలం శంకుస్థాపన రాళ్లు వేసి వదిలేశారని, కానీ కేసీఆర్ ఆ ఆలోచనను మార్చి భద్రాద్రి సీతారామ స్వామి పేరిట బృహత్తర ప్రాజెక్టును నిర్మించారని కొనియాడారు.

### సీతారామ ప్రాజెక్టుపై మంత్రుల నిర్లక్ష్యం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో కేసీఆర్ పది వేల కోట్ల రూపాయలతో సీతారామ ప్రాజెక్టును చేపట్టారని కేటీఆర్ వివరించారు. ఇందులో దాదాపు 8,000 కోట్ల రూపాయలను బీఆర్ఎస్ ప్రభుత్వమే ఖర్చు చేసిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే సత్తుపల్లి నియోజకవర్గంలోనే లక్షా 30 వేల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఖమ్మం జిల్లా నుండి ఉపముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి లాంటి పవర్‌ఫుల్ మంత్రులు ఉన్నప్పటికీ ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కనబెట్టారని ఆరోపించారు. అధికారం అంతా ఖమ్మం జిల్లాలోనే ఉన్నా రైతులకు పైసా ప్రయోజనం కలగలేదని, ఈ నిర్లక్ష్యంపై జిల్లా ప్రజలు ఆలోచించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# జల ద్రోహం

- తెలంగాణ నీటి హక్కుల రక్షణకు పోరాటం
- సీఎం రేవంత్‌కు హరీశ్ రావు ఘాటు లేఖ



తుంగభద్ర జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను తక్షణమే అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత సమైక్య పాలనలో జరిగిన నీళ్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న తెలంగాణలో, ఇప్పుడు మళ్లీ జల హక్కులను కాపాడుకోవడానికి సిద్ధం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### కర్ణాటక అక్రమ ప్రాజెక్టులపై మౌనం ఎందుకు?

కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై కురిడి, చిక్కాలపర్వి, చిక్కాలమంచి ప్రాంతాల్లో అక్రమంగా బ్రిడ్జికమ్‌బ్యారేజీలను నిర్మిస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. రాయచూర్ జిల్లాలో రెండు టీఎంసీల నీటిని తరలించేలా రూ.85 కోట్లతో చేపట్టిన కురిడి ఎత్తిపోతల పథకం పనులు ఇప్పటికే 60 శాతం పూర్తయినా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు. సెంట్రల్ వాటర్ కమిషన్, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అనుమతులు లేకుండా సాగుతున్న ఈ నిర్మాణాలపై ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఒక్క అభ్యంతర లేఖ కూడా రాయకపోవడం వెనుక ఉన్న మర్మమేమిటని ప్రశ్నించారు.

### పాలమూరు ప్రాజెక్టులకు పొంచి ఉన్న ముప్పు

ఆర్డీఎస్ ఆనకట్టకు కేవలం 100 మీటర్ల ఎగువన నిర్మిస్తున్న ఈ అక్రమ ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు వచ్చే నీటి ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయని లేఖలో పేర్కొన్నారు. కర్ణాటకకు ఆర్డీఎస్‌లో 1.2 టీఎంసీల వాటా మాత్రమే ఉన్నప్పటికీ, ఇప్పటికే సగటున 5 టీఎంసీలను వాడుకుంటోందని గణాంకాలతో సహా వివరించారు. ఈ కొత్త బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తుంగభద్ర నుండి శ్రీశైలానికి వచ్చే వరద తగ్గితే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కల్వకుర్తి, పాలమూరురంగారెడ్డి వంటి కీలక సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులు ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### కొడంగల్ లిఫ్ట్ వెనుక రాజకీయ మతలబు

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణపేట, కొడంగల్‌కు నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం కమిషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్‌ను తెరపైకి తెచ్చిందని విమర్శించారు. భీమా ప్రాజెక్టుకు ఉన్న 16.94 టీఎంసీల కేటాయింపుల్లో సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్టుకు మళ్లించడం వల్ల రెండు లక్షల ఎకరాల భీమా ఆయకట్టు దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ప్రభుత్వం ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక తెలంగాణ జల ప్రయోజనాలను తాకట్టు పెట్టే పెద్ద కుట్ర దాగి ఉందని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర హక్కులను పణంగా పెడితే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదని, రైతుల భవిష్యత్తు కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# రాష్ట్రాన్ని కమ్మేసిన నైరుతి

- తెలంగాణకు భారీ వర్ష సూచన
- వారం పాటు వానల హెచ్చరిక
- హైదరాబాద్‌లోనూ జోరు వానలు



తెలంగాణ అంతటా నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఎదురుచూసిన వర్షాలు ప్రారంభం కావడంతో ప్రజల్లో ఊరట కనిపిస్తోంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే వారం రోజుల పాటు పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది.

### రైతుల్లో తగ్గిన ఆందోళన

ఈసారి నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. నారుమడులు సిద్ధం చేయడం, సాగు పనులు ప్రారంభించడం ఆలస్యమైంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఉష్ణ పరిస్థితుల ప్రభావంతో రుతుపవనాల పురోగతి మందగించింది. జూన్ 8న రాష్ట్ర సరిహద్దులను తాకిన పవనాలు తెలంగాణ మొత్తాన్ని కమ్మేయడానికి దాదాపు పదిహేను రోజులు పట్టింది.

### పలుచోట్ల రికార్డు వర్షపాతం

సోమవారం నుంచి మంగళవారం వరకు అనేక జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం కూనారంలో ఏకంగా 17.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఇదే అత్యధిక వర్షపాతంగా అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ ప్రాంతాల్లో భారీ వానలు కురిశాయి.

### జిల్లాలపై వానల ప్రభావం

సంగారెడ్డి, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో మంగళవారం పగటి వేళలోనే వర్షాలు జోరుగా కురిశాయి. పలుచోట్ల రహదారులపై నీరు నిలవగా, సాధారణ జనజీవనం కొంత మేర ప్రభావితమైంది. చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు చేరడం ప్రారంభమైంది.

### మూడు రోజులు అప్రమత్తం

వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం బుధ, గురు, శుక్రవారాల్లో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. జూన్ 24న జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. జూన్ 25న ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ ప్రాంతాల్లో వానలు ఉద్ధృతంగా కొనసాగే అవకాశం ఉంది. జూన్ 26న వరంగల్ ప్రాంతంతో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అధికారులు వెల్లడించారు. మిగిలిన ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

# అసలు ఆఫీస్ అంటే ఏంటి?

- పోష్ చట్టంపై హైకోర్టు కీలక తీర్పు
- మహిళల రక్షణ పరిధిపై న్యాయస్థానం స్పష్టత


ఏఐ చిత్రం

మహిళల రక్షణ కోసం ఉద్దేశించిన పోష్ చట్టం పరిధిలోని 'కార్యాలయం'.. వర్క్‌ప్లేస్ అనే పదానికి బాంబే హైకోర్టు ఒక ముఖ్యమైన తీర్పులో సరికొత్త స్పష్టతనిచ్చింది. ఉద్యోగి ఆఫీసుకు వెళ్లే క్రమంలో ఉపయోగించే సాధారణ షేర్డ్ ఆటోరిక్షా చట్టం పరిధిలోకి రాదని కోర్టు స్పష్టం చేసింది. యాజమాన్యం స్వయంగా వాహన వసతి కల్పిస్తే తప్ప, పబ్లిక్ రవాణా సాధనాలను కార్యాలయంగా పరిగణించలేమని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ తీర్పు ద్వారా పని స్థలంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలు పరిధిపై ఉన్న అనేక అనుమానాలకు తెరపడింది.

### ఐసీసీ నిర్ణయాన్ని కొట్టివేసిన కోర్టు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి ఒకరు సహోద్యోగితో కలిసి షేర్డ్ ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు జరిగిన ఒక సంఘటనపై అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారణ జరిపి సదరు ఉద్యోగిని దోషిగా తేల్చింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన బాంబే హైకోర్టు, జూన్ 16న ఇచ్చిన తీర్పులో ఐసీసీ అంచనాలను పక్కన పెట్టింది. సదరు రవాణా సౌకర్యాన్ని ఎస్‌బీఐ సంస్థ గానీ, బాధితురాలి సంస్థ గానీ కల్పించలేదని కోర్టు గుర్తుచేసింది. అందువల్ల పోష్ చట్టం సెక్షన్ 2(o)(వి) ప్రకారం ఈ ప్రయాణాన్ని కార్యాలయ పరిధిగా గుర్తించలేమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. అయితే సదరు వ్యక్తి వేధింపులకు పాల్పడ్డాడా లేదా అనే అసలు నిజానిజాలను ఇతర చట్టపరమైన మార్గాల్లో తేల్చుకోవచ్చని కోర్టు పేర్కొంది.

### చట్టం ప్రకారం కార్యాలయం అంటే ఏమిటి?

పోష్ చట్టం సెక్షన్ 2(o) ప్రకారం కార్యాలయం అనే పదానికి అర్థాలు చాలా విస్తృతంగా ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగానికి చెందిన అన్ని రకాల విభాగాలు, సంస్థలు, కార్యాలయాలు, శాఖలు దీని పరిధిలోకి వస్తాయి. ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్రీడా ప్రాంగణాలు, శిక్షణా కేంద్రాలు కూడా ఈ చట్టం పరిధిలో భాగమే. వీటితో పాటు ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఉద్యోగి సందర్శించే ఏ ప్రాంతమైనా, యాజమాన్యం కల్పించే రవాణా సౌకర్యమైనా కార్యాలయంగానే పరిగణించబడుతుంది. ఇండ్లలో పనిచేసే గృహ కార్మికుల విషయానికి వస్తే వారి యజమాని ఇల్లే వారి పని స్థలంగా మారుతుంది. పది మంది కంటే తక్కువ కార్మికులు ఉండే అసంఘటిత రంగ సంస్థలకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయి.

### విస్తరిస్తున్న వర్చువల్ ఆఫీస్ పరిధి

సాంకేతికత పెరుగుతున్న నేటి కాలంలో కోర్టులు కార్యాలయం అనే పదానికి మరింత విస్తృతమైన అర్థాన్ని ఇస్తున్నాయి. ఇంటర్నెట్ ఆధారంగా పనిచేసే డిజిటల్, రిమోట్ వర్క్‌స్పేస్‌లను కూడా చట్టం పరిధిలోకి చేర్చారు. ఒకే సంస్థకు చెందిన ఇద్దరు ఉద్యోగులు వేర్వేరు భౌగోళిక ప్రాంతాల నుండి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌పై కలిసి పనిచేస్తున్నప్పుడు కూడా వారు ఒకే కార్యాలయంలో ఉన్నట్లు భావించాలని గతంలో రాజస్థాన్ హైకోర్టు తీర్పునిచ్చింది. వాట్సాప్, ఫేస్‌బుక్, మెసెంజర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా సహోద్యోగులకు అనుచిత సందేశాలు, ఆడియో, వీడియోలు పంపడం కూడా చట్టప్రకారం వేధింపుల కిందకే వస్తుందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. శారీరక వేధింపులే కాకుండా మాటల ద్వారా, సైగల ద్వారా ఇబ్బంది పెట్టడం కూడా నేరమేనని న్యాయస్థానాలు వివిధ కేసుల్లో స్పష్టం చేశాయి.

# ప్రకృతి ప్రకోపం

- దేశవ్యాప్తంగా వర్షా లు
- ముంబైని ముంచెత్తిన వానలు



దేశంలో రుతుపవనాల ఆగమనం తీవ్ర రూపం దాల్చింది. దేశంలోని పలు రాష్ట్రాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్ నుండి పశ్చిమ తీరంలోని ముంబై మహానగరం వరకు వానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల కారణంగా నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం కావడంతో అటు ప్రజలు, ఇటు ప్రభుత్వ యంత్రాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

### ముంబై నగరానికి ఆరెంజ్ అలర్ట్

మరోవైపు మహారాష్ట్ర రాజధాని ముంబై నగరం భారీ వర్షాలతో మునిగిపోయింది. రాత్రంతా కురిసిన వర్షానికి తోడు బుధవారం ఉదయం కూడా కుండపోత వాన పడింది. దీంతో భారత వాతావరణ శాఖ ముంబై నగరంతో పాటు థానే, రాయగఢ్, పాల్ఘర్, సింధుదుర్గ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ముంబై నగరంలో రికార్డు స్థాయిలో 195 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పశ్చిమ శివారు ప్రాంతాలలో అత్యధికంగా 208 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

### నిలిచిపోయిన రవాణా, కూలిన గోడలు

నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా వచ్చినప్పటికీ ముంబై నగరంలో తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. సాకినాక మెట్రో స్టేషన్ పరిసరాలు, ఎవరార్డ్ నగర్ సబ్‌వే వంటి అనేక ప్రాంతాలలో మోకాళ్ల లోతు నీరు చేరింది. ముంబైలోని విక్రోలి వెస్ట్ ప్రాంతంలో ఒక నివాస భవనం పక్కన ఉన్న రక్షణ గోడ కూలిపోయింది. దాదర్ ప్రాంతంలో ఒక పెద్ద చెట్టు కారుపై విరిగిపడింది. ఈ రుతుపవనాలు మహారాష్ట్రతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బీహార్ రాష్ట్రాలకు కూడా విస్తరించాయని వాతావరణ శాఖ తెలిపింది.

### అరుణాచల్ ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు

అరుణాచల్ ప్రదేశ్‌లోని కేయి పన్యోర్ జిల్లాలో బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు ఆకస్మిక వరదలు వచ్చాయి. ఈ వరదల కారణంగా ఎగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. సుమారు పద్దెనిమిది నివాస గృహాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనివల్ల ప్రయాణికులు రోడ్లపైనే చిక్కుకుపోయారు. యాజాలి పరిధిలోని నీప్కో ప్రాజెక్ట్ కాలనీ సమీపంలో ముగ్గురు వ్యక్తులు గల్లంతైనట్లు విపత్తు నిర్వహణ శాఖ అధికారులు వెల్లడించారు.

### అప్రమత్తమైన అస్సాం ప్రభుత్వం

అరుణాచల్ ప్రదేశ్ ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావం దిగువన ఉన్న అస్సాం రాష్ట్రంపై పడుతోంది. బ్రహ్మపుత్ర నది, దాని ఉపనదులలో నీటి మట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో అస్సాం ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. వరద పరిస్థితిని అస్సాం ముఖ్యమంత్రి కార్యాలయం స్వయంగా పర్యవేక్షిస్తోంది.

# విస్తుపోయే నిజాలు..

## అన్నపై ప్రేమ

- సియా గోయల్ ఘాతుకాన్ని బయటపెట్టిన సోదరి
- అనుమానాస్పద మృతిపై సోదరి పోరాటం



పూణే నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ జూన్ 18వ తేదీన లోహగడ్ కోట లోయలో పడి మరణించారు. ఆయన కాబోయే భార్య సియా గోయల్ దీనిని ఒక ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నించింది. ఫోటోలకు పోజులు ఇస్తుండగా కేతన్ కాలు జారి లోయలో పడిపోయాడని ఆమె పోలీసులకు చెప్పింది. లోనావాలా రూరల్ పోలీసులు మొదట దీనిని ప్రమాదవశాత్తు జరిగిన మరణంగానే భావించి కేసు నమోదు చేశారు. అయితే కేతన్ అంత్యక్రియలు ముగిసిన తర్వాత కూడా ఆయన సోదరి మనసు ఈ ప్రమాద కథనాన్ని అంగీకరించలేదు. ఆమెకు అనేక ప్రశ్నలు సమాధానం లేకుండా మిగిలిపోయాయి.

### సియా ప్రవర్తనతో బలపడిన అనుమానాలు

ఘటన జరిగిన నాలుగు రోజుల తర్వాత సియా గోయల్ పరామర్శించడానికి కేతన్ కుటుంబ సభ్యుల ఇంటికి వచ్చింది. ఆ సమయంలో కేతన్ సోదరి లోహగడ్ కోట వద్ద అసలు ఏం జరిగిందనే విషయంపై సియాను వివరంగా ప్రశ్నించింది. ఆ సమయంలో సియా చెప్పిన సమాధానాలలో తీవ్రమైన పరస్పర విరుద్ధ అంశాలు కనిపించాయి. ప్రశ్నల నుండి ఆమె తప్పించుకోవడానికి ప్రయత్నించడం చూసి సోదరి అనుమానం మరింత బలపడింది. దీనితో ఆమె తన అనుమానాలను కుటుంబ సభ్యులతో పంచుకుంది. అందరూ కలిసి పోలీసులను ఆశ్రయించి ఈ కేసుపై సమగ్ర విచారణ జరపాలని గట్టిగా కోరారు.

### సీసీటీవీ విజువల్స్ తెచ్చిన మలుపు

కుటుంబ సభ్యుల ఒత్తిడితో పోలీసులు రంగంలోకి దిగి సాంకేతిక ఆధారాలను సేకరించడం ప్రారంభించారు. లోహగడ్ కోట పరిసర ప్రాంతాలలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా ఒక వింత విషయం వెలుగుచూసింది. జూన్ నెల తీవ్రమైన ఎండలలో కూడా ఒక వ్యక్తి హుడీ ధరించి, కేతన్, సియా ప్రయాణిస్తున్న వాహనాన్ని వెంబడించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ అనుమానాస్పద వ్యక్తిని చేతన్ చౌదరిగా గుర్తించారు. విచారణలో సియాకు, చేతన్‌కు గత మూడేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తోందని తేలింది. ఈ ఏడాది జనవరి నుండి జూన్ మధ్య కాలంలోనే వీరిద్దరు ఏకంగా 2,004 సార్లు ఫోన్లలో మాట్లాడుకున్నట్లు కాల్ డేటా ఆధారాలు లభించాయి.

### హంతకులను అరెస్ట్ చేసిన పోలీసులు

పోలీసులు సియా, చేతన్‌లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా అసలు నిజం బయటపడింది. చేతన్‌తో కలిసి తన జీవితాన్ని పంచుకోవడానికి సియా ఈ దారుణమైన హత్యకు ప్లాన్ చేసినట్లు ఒప్పుకుంది. మే 31 నుండి జూన్ 18 మధ్య మూడు సార్లు కేతన్‌ను లోహగడ్ కోటకు తీసుకువెళ్లి, చివరికి పక్కా ప్రణాళికతో లోయలోకి నెట్టి చంపినట్లు విచారణలో తేలింది. ఈ ఘోరమైన కుట్రను ఛేదించిన పోలీసులు జూన్ 23న సియా గోయల్, చేతన్ చౌదరిలను అరెస్ట్ చేశారు. కేతన్ సోదరి చూపిన చొరవ, పట్టుదల వల్లే ఒక పక్కా మర్డర్ ప్లాన్ బయట పడింది.



## కెఫే ప్లాన్ టు క్లిఫ్ మర్డర్

- కెఫేలో ముందస్తు హత్య ప్రణాళిక
- ప్రియుడితో కలిసి కాబోయే భర్తను తోసేసిన వైనం


పూణే నగరానికి చెందిన 26 ఏళ్ల వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసులో షాకింగ్ నిజాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. జూన్ 18వ తేదీన లోహగడ్ కోట లోయలోకి నెట్టి కేతన్‌ను హత్య చేయడానికి కొన్ని గంటల ముందే నిందితురాలు సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి పూణేలోని ఒక కెఫేలో సమావేశమైంది. అక్కడ ఇద్దరూ కలిసి హత్యను ఎలా చేయాలి, ఏ ప్రదేశం నుండి కిందకు నెట్టాలి అనే విషయాలపై పక్కా స్కెచ్ వేశారు. ఆ తర్వాతే ప్లాన్ ప్రకారం కేతన్‌ను కోటపైకి తీసుకువెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.

### కోటపై విఫలమైన తొలి ప్రయత్నం

కేతన్‌కు సియాతో ఫిబ్రవరి నెలలో నిశ్చితార్థం జరిగింది. రాబోయే నవంబర్‌లో జైపూర్‌లో వీరిద్దరికీ ఘనంగా వివాహం జరగాల్సి ఉంది. అయితే సియాకు చేతన్‌తో ప్రేమ వ్యవహారం ఉండటంతో కేతన్‌ను వదిలించుకోవాలని చూసింది. ఇందులో భాగంగానే మే 31 నుండి వరుసగా కేతన్‌ను లోహగడ్ కోటకు తీసుకువెళ్లడానికి ఒత్తిడి తెచ్చింది. జూన్ 14న జరిగిన పర్యటనలో ఆమె కేతన్‌ను కొండపై నుండి తోసేయడానికి ప్రయత్నించింది. అయితే అదృష్టవశాత్తూ కేతన్ ఒక పొదను పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ సమయంలో కేతన్ ప్రశ్నించగా అక్కడ పాము ఉందంటూ అబద్ధం చెప్పి తనే కాపాడినట్లు నాటకమాడింది.

### హాట్ సమ్మర్‌లో హుడీ తెచ్చిన ముప్పు

హత్య జరిగిన జూన్ 18వ తేదీ మధ్యాహ్నం 33 డిగ్రీల తీవ్రమైన ఎండ ఉంది. అంతటి వేడి వాతావరణంలో కూడా చేతన్ చౌదరి తన గుర్తింపును దాచడానికి ఒక హుడీ, హెడ్‌సెట్ ధరించి కేతన్, సియా వెనుక కొండపైకి వెళ్లాడు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులకు ఈ హుడీ ధరించిన వ్యక్తి ప్రవర్తనపై అనుమానం వచ్చింది. అంత ఎండలో హుడీ ఎందుకు వేసుకున్నారనే ప్రశ్నతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు సాంకేతిక విశ్లేషణలో చేతన్ సోషల్ మీడియా ప్రొఫైల్స్ ఆధారంగా అతనే ఆ వ్యక్తి అని పక్కాగా తేలిపోయింది.




### పాస్‌పోర్ట్ మాయం వెనుక అసలు రహస్యం

నిజానికి పెళ్లికి ముందే వీరిద్దరూ ప్రీవెడ్డింగ్ ఫోటోషూట్ కోసం బాలి వెళ్లాల్సి ఉంది. కానీ కేతన్ పాస్‌పోర్ట్ అనుమానాస్పదంగా మాయం కావడంతో ఆ పర్యటన రద్దయింది. విచారణలో సియా, చేతన్ గత ఏడు నెలల్లో ఏకంగా 2,004 సార్లు ఫోన్లలో మాట్లాడుకున్నట్లు తేలింది. చేతన్‌తో పారిపోతే తన కుటుంబ పరువు పోతుందని భావించిన సియా, పెళ్లికి ముందే కేతన్‌ను శాశ్వతంగా అంతమొందించాలని ఈ దారుణానికి ఒడిగట్టింది. ప్రస్తుతం పోలీసులు నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ప్రేమ

- ప్రేమ నాటకం.. ప్రాణం తీసిన కుట్ర
- కాబోయే భర్తను చంపేందుకు స్కెచ్

సోషల్ మీడియాలో చూస్తే వారిద్దరూ అత్యంత అన్యోన్యమైన జంట. కాబోయే భర్త కేతన్ అగర్వాల్‌తో కలిసి సియా గోయల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్టులు చూసి అంతా నిజమైన ప్రేమ అనుకున్నారు. నా హృదయానికి ఒక అందమైన ఇల్లు దొరికింది అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్లు నెటిజన్లను ఎంతగానో ఆకర్షించాయి. పుట్టినరోజు కౌంట్‌డౌన్ పేరిట రొమాంటిక్ పాటలకు డ్యాన్సులు చేస్తూ వీడియోలు పెట్టింది. నవంబర్ నెలలో జైపూర్ ప్యాలెస్‌లో ప్రైవేట్ జెట్‌లతో వీరి అంగరంగ వైభవ వివాహానికి భారీ ఏర్పాట్లు కూడా జరిగాయి. బయటకు ఇంత నాటకం ఆడుతూ లోపల మాత్రం అతన్ని దారుణంగా చంపేందుకు భయంకరమైన కుట్ర రగులుతోందని ఎవరూ ఊహించలేకపోయారు.

### లోహగడ్ కోటలో దారుణం

జూన్ 18వ తేదీన పూణే నగర సమీపంలోని లోహగడ్ కోట వద్ద కేతన్ అనుమానాస్పద స్థితిలో లోయలో పడి చనిపోయాడు. ఫోటోలు దిగుతుండగా కాలు జారి అమాంతం లోయలో పడిపోయాడని సియా మొదట పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది. లోతైన విచారణలో నమ్మలేని కఠోర నిజాలు వెలుగులోకి వచ్చాయి. సియా తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి పక్కా పథకం ప్రకారం కేతన్‌ను కొండపై నుంచి కిందకు నెట్టేసి హత్య చేసినట్లు నిర్ధారణ అయింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగిన తర్వాత కేతన్ మరణం పట్ల ఆమె ముఖంలో ఎలాంటి బాధ లేకపోవడంతో పోలీసుల అనుమానం మరింత బలపడింది.

### ఫోన్ కాల్స్ పట్టించిన గుట్టు

పోలీసుల దర్యాప్తులో సియా, చేతన్‌ల చీకటి ప్రేమ వ్యవహారం బట్టబయలైంది. కేతన్‌తో నిశ్చితార్థం జరిగినప్పటికీ ఆమె చేతన్‌తోనే తన వివాహేతర సంబంధం కొనసాగించింది. గత ఏడు నెలల కాలంలో వీరు ఏకంగా 2,004 సార్లు ఫోన్లో మాట్లాడుకున్నట్లు కాల్ డేటా ద్వారా తేలింది. కేతన్‌ను తమ ప్రేమకు అడ్డుగోడగా భావించిన చేతన్ అతన్ని శాశ్వతంగా వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే కోట వద్దకు కేతన్‌ను తీసుకువెళ్లిన సియా, వెనకాలే రహస్యంగా ముఖం కనిపించకుండా హుడీ ధరించి వచ్చిన చేతన్‌తో కలిసి ఈ దారుణమైన అఘాయిత్యానికి పాల్పడింది.

### బాలి ట్రిప్ రద్దు.. తొలి యత్నం విఫలం

ఈ దారుణమైన హత్యకు ముందే నిందితులు పలుమార్లు కేతన్‌ను చంపేందుకు విఫలయత్నాలు చేశారు. ప్రీవెడ్డింగ్ ఫోటో షూట్ కోసం బాలి వెళ్లాల్సిన ప్రయాణాన్ని సియా కావాలనే చెడగొట్టింది. ముంబై విమానాశ్రయానికి చేరుకునే సమయానికి కేతన్ పాస్‌పోర్ట్ దొంగిలించి ఆ ట్రిప్ రద్దయ్యేలా చేసింది. ఆ తర్వాత జూన్ 14వ తేదీన లోహగడ్ కోట వద్దే తొలిసారి కేతన్‌ను కొండపై నుంచి కిందకు తోసేసింది. అదృష్టవశాత్తూ అతను ఒక చిన్న పొదను గట్టిగా పట్టుకుని తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. అక్కడ ఒక పాము వచ్చిందంటూ కట్టుకథ అసలు నిజం బయటపడకుండా సియా చాలా తెలివిగా జాగ్రత్తపడింది.

## ఎవరీ కేతన్ అగర్వాల్?

- ధనవంతుడి ప్రాణం తీసిన నకిలీ ప్రేమ
- కోటీశ్వరుడిని బలితీసుకున్న అందమైన రాక్షసి
- పూణే వ్యాపారవేత్త హత్య వెనుక నమ్మలేని నిజాలు

పూణే నగరానికి చెందిన 26 ఏళ్ల కేతన్ అగర్వాల్ ఒక ఉన్నతమైన విద్యావంతుడు, విజయవంతమైన యువ వ్యాపారవేత్త. ఆయన తన కుటుంబానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'సక్సెస్ గ్రూప్'కు డైరెక్టర్‌గా, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సింబయాసిస్ విశ్వవిద్యాలయం నుండి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ పూర్తి చేసిన కేతన్, అమెరికాలోని ప్రతిష్ఠాత్మక బాబ్సన్ గ్రాడ్యుయేట్ స్కూల్ నుండి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో మాస్టర్స్ పట్టా పొందారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే సరికొత్త నిర్మాణ ప్రాజెక్టులతో సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ యువకుడి జీవితం ఒక ఘోరమైన కుట్ర కారణంగా అర్థాంతరంగా ముగిసిపోయింది.

### ఘనంగా నిశ్చితార్థం.. ప్యాలెస్‌లో పెళ్లి ఏర్పాట్లు

కేతన్ అగర్వాల్‌కు సియా గోయల్ అనే యువతితో ఫిబ్రవరి నెలలో ఎంతో వైభవంగా నిశ్చితార్థం జరిగింది. ఈ ఏడాది నవంబర్ మాసంలో రాజస్థాన్‌లోని ఒక పురాతన రాజభవనంలో రూ. 17 కోట్ల భారీ బడ్జెట్‌తో వీరి వివాహానికి ఇరువైపులా పెద్దలు నిశ్చయించారు. పెళ్లికి వచ్చే అతిథుల కోసం ప్రత్యేకంగా రెండు ప్రైవేట్ విమానాలను కూడా బుక్ చేశారు. ఇరు కుటుంబాలు ఎంతో సంతోషంగా పెళ్లి పనుల్లో మునిగిపోయాయి. అయితే సియా మనసులో మాత్రం మరొకరికి స్థానం ఉందనే విషయాన్ని పాపం ఆ అమాయక యువకుడు గుర్తించలేకపోయాడు.

### లోహగడ్ కోటలో పక్కా ప్లాన్

పెళ్లి జరిగితే తన ప్రేమకు అడ్డు వస్తాడని భావించిన సియా, తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి కేతన్‌ను హతమార్చడానికి ఒక కిరాతక ప్లాన్ వేసింది. జూన్ 18వ తేదీన కేతన్‌ను ఒప్పించి పూణే సమీపంలోని లోహగడ్ కోటకు ట్రెకింగ్ కోసం తీసుకువెళ్లింది. అక్కడ ఫోటోలకు పోజులు ఇస్తుండగా కాలు జారి లోయలో పడిపోయాడంటూ మొదట ఒక పెద్ద నాటకమాడింది. బలమైన గాలుల వల్ల ఈ ప్రమాదం జరిగిందని పోలీసులను నమ్మించింది. కానీ పోలీసులు జరిపిన లోతైన సాంకేతిక విచారణలో సియా, ఆమె ప్రియుడు చేతన్ ఇద్దరూ కలిసి కేతన్‌ను వెనుక నుండి లోయలోకి నెట్టి చంపినట్లు రుజువైంది.

## పుట్టిన రోజు వేడుక వెనుక కుట్ర

- ఫైవ్ స్టార్ హోటల్ రూమ్‌ల బుకింగ్ రద్దు చేయించి మరీ హత్య
- విలాసవంతమైన వేడుకను వద్దన్న నిందితురాలు



పూణే వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసులో రోజురోజుకూ విస్తుపోయే నిజాలు బయటకు వస్తున్నాయి. నిందితురాలు సియా గోయల్ జూన్ 20వ తేదీన జరుపుకోవాల్సిన తన పుట్టినరోజు వేడుకల కోసం కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ మహాబలేశ్వర్‌లోని ఒక ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్‌లో ఏకంగా 70 గదులను బుక్ చేశారు. రెండు కుటుంబాలు కలిసి ఘనంగా వేడుకలు జరపాలని భావించాయి. అయితే ఈ ఆర్భాటం తనకు వద్దంటూ సియా నాటకమాడింది. ఆ వేడుకలను రద్దు చేయించి, జూన్ 18వ తేదీన కేతన్‌ను ఒంటరిగా లోహగడ్ కోటకు తీసుకెళ్లి తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి లోయలోకి నెట్టి చంపేసింది.

### వ్యాపార పరిచయంతో మొదలైన ప్రేమ వ్యవహారం

కేతన్ అగర్వాల్ మహారాష్ట్రలోని ఒక పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థకు డైరెక్టర్‌గా పనిచేసేవాడు. ఫిబ్రవరిలో కేతన్, సియాల నిశ్చితార్థం జరగ్గా నవంబర్‌లో వివాహం నిశ్చయమైంది. అయితే సియాకు పూణేలో ఒక బేకరీ ఉండేది. డ్రై ఫ్రూట్స్ వ్యాపారం చేసే చేతన్ చౌదరి అనే 22 ఏళ్ల యువకుడితో గత ఏడాది నవంబర్‌లో ఒక బిజినెస్ మీటింగ్‌లో ఆమెకు పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. కేతన్‌తో పెళ్లి జరిగితే తమ ప్రేమకు అడ్డు వస్తాడని భావించిన చేతన్, కేతన్‌ను శాశ్వతంగా వదిలించుకోవాలని సియాను ఒప్పించాడు. ఇందుకోసం వారు కొన్ని రోజుల ముందే ఒక కేఫేలో కలిసి ప్లాన్ వేశారు.

### బాలి ట్రిప్ క్యాన్సిల్ వెనుక పెద్ద స్కెచ్

నిజానికి గత నెలలో కేతన్, సియా ప్రీవెడ్డింగ్ ఫోటోషూట్ కోసం బాలి వెళ్లాల్సి ఉంది. ముంబై విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత కేతన్ పాస్‌పోర్ట్ మాయమైనట్లు గుర్తించడంతో ఆ పర్యటన రద్దయింది. సియానే ఉద్దేశపూర్వకంగా ఆ పాస్‌పోర్ట్‌ను దొంగిలించి దాచిపెట్టిందని కేతన్ తండ్రి ఇప్పుడు ఆరోపిస్తున్నారు. బాలి ట్రిప్ రద్దు కాగానే సియా తన ప్లాన్‌ను లోహగడ్‌కు మార్చింది. జూన్ 14న జరిగిన మొదటి ప్రయత్నంలో కేతన్‌ను కొండపై నుండి తోసేయగా అతను ఒక పొదను పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ సమయంలో అక్కడ పాము ఉందంటూ అబద్ధం చెప్పి సియా తప్పించుకుంది. ఒకవేళ లోహగడ్ ప్లాన్ విఫలమైతే అమలు చేయడానికి వారు ఒక 'ప్లాన్ సి'ని కూడా సిద్ధంగా ఉంచుకోవడం వారి క్రూరత్వానికి అద్దం పడుతోంది.

---

## బాల్క సుమన్‌కు బెయిల్

- సింగరేణి కేసులో హైకోర్టు కీలక నిర్ణయం
- జైలు నుంచి విడుదలకు మార్గం సుగమం



సింగరేణి సంస్థపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత బాల్క సుమన్‌కు తెలంగాణ హైకోర్టు బుధవారం పెద్ద ఉపశమనం కలిగించింది. గత కొన్ని రోజులుగా చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను న్యాయస్థానం మంజూరు చేసింది. రూ. 25 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు ఇద్దరు వ్యక్తుల పూచీకత్తును సమర్పించాల్సిందిగా న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో మే 30 నుండి జైలులో ఉన్న సుమన్ విడుదలకు అధికారికంగా మార్గం సుగమమైంది.


### వివాదానికి కారణమైన సింగరేణి వ్యాఖ్యలు

గత మే 26వ తేదీన తెలంగాణ భవన్‌లో జరిగిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం సమావేశంలో బాల్క సుమన్ ప్రసంగించారు. నాంపల్లిలోని సింగరేణి భవన్, మందమర్రిలోని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని లేపాయి. ఈ ప్రసంగంపై సింగరేణి యాజమాన్యం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు ఆధారంగానే నాంపల్లి పోలీసులు సుమన్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మే 30న తెలంగాణ భవన్‌లో అరెస్ట్ చేశారు.

### కొన్ని సెక్షన్లను కొట్టివేసిన నాంపల్లి కోర్టు

పోలీసుల ప్రాథమిక విచారణలో భాగంగా సుమన్‌పై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 152, 353(1)(బి) తో పాటు ప్రభుత్వ ఆస్తుల నష్టం నిరోధక చట్టం (పీడీపీపీ) కింద కేసులు పెట్టారు. అయితే జూన్ 1న నాంపల్లి కోర్టు ఈ కేసును పరిశీలించి ప్రభుత్వ ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేసింది. అందువల్ల ఆస్తుల ధ్వంసానికి సంబంధించిన కఠినమైన సెక్షన్లను న్యాయస్థానం కొట్టివేసింది. కేవలం దేశ సార్వభౌమత్వానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్న కొన్ని సెక్షన్ల పరిధిలోనే విచారణ కొనసాగేందుకు అనుమతించింది.

## వాణిజ్య వ్యూహం



- భారత్-అమెరికా బిజినెస్ డీల్
- ఒప్పందాల అమలుపై ఫోకస్
- ఢిల్లీలో ముగిసిన కీలక చర్చలు

ఇండియా, అమెరికా దేశాల మధ్య వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు న్యూఢిల్లీలో కీలక చర్చలు జరిగాయి. అమెరికా వాణిజ్య ప్రతినిధి జామీసన్ గ్రీర్ రెండు రోజుల పర్యటన కోసం భారతదేశానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన భారత కేంద్ర ప్రభుత్వ వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో పలుమార్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత తాత్కాలిక వాణిజ్య ఒప్పందంతో పాటు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలోని ముఖ్యమైన అంశాలపై వీరిద్దరూ సుదీర్ఘంగా సమీక్షించారు.

### చర్చల్లో పురోగతి సాధించిన ఇరు దేశాలు

గత కొన్ని నెలలుగా ఇరు దేశాల చర్చల బృందాలు సాధించిన ప్రగతిని మంత్రి పీయూష్ గోయల్, జామీసన్ గ్రీర్ అభినందించారు. ఈ చర్చలు చాలా సానుకూల వాతావరణంలో జరిగాయని భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మార్కెట్ సౌకర్యాలు కల్పించడం, డిజిటల్ వ్యాపారాన్ని పెంపొందించడం, సరఫరా గొలుసును బలోపేతం చేయడం వంటి అంశాలపై ఇరుపక్షాల మధ్య లోతైన చర్చలు జరిగాయి. వ్యూహాత్మక రంగాలలో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని, వాణిజ్యానికి అడ్డుగా ఉన్న సాంకేతికేతర అడ్డంకులను తొలగించాలని ఇరు దేశాలు ఒక అవగాహనకు వచ్చాయి.

### గడువు ప్రకటించని అగ్రదేశాల ప్రతినిధులు

ఈ చర్చల్లో గణనీయమైన పురోగతి కనిపించినప్పటికీ, ఒప్పందాలను ఎప్పటిలోగా ఖరారు చేస్తారనే విషయమై ఎలాంటి స్పష్టమైన గడువును ఇరు దేశాలు ప్రకటించలేదు. నిజానికి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని గత ఏడాది లోపే పూర్తి చేయాలని భావించారు. అలాగే తాత్కాలిక ఒప్పందాన్ని కూడా ఈ ఏడాది ఏప్రిల్ లేదా మే నాటికే ముగించాల్సి ఉంది. ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య మార్పులను తట్టుకుంటూ వ్యాపారవేత్తలు, రైతులు, కార్మికులు, వినియోగదారులకు స్పష్టమైన ప్రయోజనాలు చేకూర్చే సమతుల్య ఒప్పందం కోసమే చర్చలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

---

## భూకుంభకోణం సెగ

- ఎంపీ సీఎంపై ప్రతిపక్షాల దాడి
- ల్యాండ్ బ్యాంక్ వివాదంలో మోహన్ యాదవ్


మధ్యప్రదేశ్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలతో ప్రతిపక్షాలు ఆయనపై విమర్శల దాడిని ఉధృతం చేశాయి. ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత ఆయన కుటుంబ సభ్యులు ఉజ్జయిని ప్రాంతంలో భారీగా ల్యాండ్ బ్యాంక్ పెంచుకున్నట్లు జాతీయ మీడియాలో వచ్చిన కథనాలు ఈ వివాదానికి కారణమయ్యాయి. ఈ వ్యవహారంలో ఇన్సైడర్ ట్రేడింగ్ జరిగిందని, ప్రభుత్వ ప్రాజెక్టులు వచ్చే ప్రాంతాలను ముందే తెలుసుకుని ఈ భూములు కొన్నారని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

### రూ.45 కోట్ల భూముల కొనుగోలు ఆరోపణలు

మీడియా కథనాల ప్రకారం, డిసెంబర్ 2023 నుండి మోహన్ యాదవ్ కుటుంబం, రియల్ ఎస్టేట్ సంస్థలు ఉజ్జయినిలో కనీసం 137 ప్లాట్లను కొనుగోలు చేశాయి. సుమారు 168 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల విలువ 45 కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా. ప్రభుత్వం రోడ్డు ప్రాజెక్టులు, భూ వినియోగ మార్పులను ప్రకటించిన ప్రాంతాల్లోనే ఈ ప్లాట్లు కేంద్రీకృతమై ఉండటం గమనార్హం. మాస్టర్ ప్లాన్ వివరాలు ముందే తెలిసి ముఖ్యమంత్రి తన కుటుంబానికి లబ్ధి చేకూర్చారని కాంగ్రెస్ నాయకులు పవన్ ఖేరా, కేసీ వేణుగోపాల్ విమర్శిస్తూ ఈడీ, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

### ఆరోపణలను తిప్పికొట్టిన బీజేపీ

ఈ ఆరోపణలను మధ్యప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు హేమంత్ ఖండేల్వాల్ పూర్తిగా తోసిపుచ్చారు. ఇవన్నీ ఆధారాలు లేని తప్పుడు ఆరోపణలని ఆయన కొట్టిపారేశారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల నాయకుడు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారీ కాంగ్రెస్ ఇలాంటి కుట్రలు చేస్తూ వారిని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. గతంలో ఉమాభారతి, శివరాజ్ సింగ్ చౌహాన్ విషయంలో కూడా కాంగ్రెస్ ఇలాగే వ్యవహరించిందని గుర్తు చేశారు.



### కుటుంబ ఆస్తుల వివరాల వెల్లడి

ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల ఆస్తుల రికార్డులను బీజేపీ నేత బహిరంగపరిచారు. 2023 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం సీఎం మోహన్ యాదవ్‌కు ఉన్న 17 ఎకరాల భూమిలో 2026 నాటికి ఎటువంటి మార్పు రాలేదని స్పష్టం చేశారు. ఆయన భార్య సీమ యాదవ్ పేరిట ఉన్న 12.29 ఎకరాలు, కుమారుడు వైభవ్ యాదవ్ పేరిట ఉన్న 16 ఎకరాల భూమి కూడా పెరగలేదన్నారు. ఇవన్నీ మాస్టర్ ప్లాన్ రాకముందు నుండే వారి పేర్లపై ఉన్నాయని తెలిపారు. 2025లో సీఎం కోడలు షాలినీ యాదవ్ కొనుగోలు చేసిన 10 ఎకరాల భూమి కూడా మాస్టర్ ప్లాన్ పరిధి వెలుపల, ఎలాంటి అభివృద్ధి చెందని జోన్‌లో ఉందని వివరించారు.

### రాజీనామా డిమాండ్, బీజేపీ అంతర్గత కుట్ర కోణం

ఈ వివాదంపై స్పందించిన మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితు పట్వారీ, దీనిని 'మహాకాల్ భూమి దోపిడీ'గా అభివర్ణిస్తూ ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# మహిళలకు 'శక్తి యాప్'పై పోలీసుల అవగాహన



**చీరాల, జూన్ 24(నాదేశం) :** మహిళల భద్రతే ధ్యేయంగా బాపట్ల జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు, చీరాల డిఎస్పీ మోయిన్ పర్యవేక్షణలో పట్టణంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కొత్తపేట పరిధిలోని 'హాయ్ రెస్టారెంట్' సమీపంలో శక్తి టీం సభ్యురాలు సిహెచ్. సునీత స్థానిక మహిళలతో 'శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శక్తి టీం ప్రతినిధి సునీత మాట్లాడుతూ.. మహిళలు అత్యవసర సమయాల్లో తమను తాము కాపాడుకోవడానికి 'శక్తి యాప్'ను మొబైల్‌లో డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆపదలో ఆదుకునే హెల్ప్‌లైన్ నంబర్లు 112, 181, 1930, 1972 లపై అవగాహన కల్పించారు. అపరిచిత లింకులు ఓపెన్ చేసి సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. పిల్లలకు ఇంట్లోనే 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'లపై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని కోరారు.

# నిజాయితీ చాటుకున్న ఆటోవాలా



**చీరాల, జూన్ 24(నాదేశం) :** లక్షల విలువైన సొత్తు దొరికినా ఆశకు పోకుండా ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకుని ఆదర్శంగా నిలిచారు. దాసరి పద్మావతి అనే మహిళ తన భర్తతో కలిసి బుధవారం చీరాల కొత్తపేట నుండి ఆటోలో బస్టాండ్‌కు చేరుకున్నారు. ఆటో దిగే హడావుడిలో రూ.9 లక్షల విలువైన 8 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.7,000 నగదు ఉన్న బ్యాగ్‌ను సీటుపైనే మరిచిపోయారు. బాధితులు ఆందోళనతో చీరాల 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తుండగానే.. సదరు ఆటో డ్రైవర్ మొగిలి శాంతకుమార్ ఆ బ్యాగ్‌ను భద్రంగా తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు. ప్రయాణికులు దిగిన తర్వాత బ్యాగ్‌ను గమనించానని, బస్టాండ్‌లో వెతికినా వారు కనిపించకపోవడంతో నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చానని డ్రైవర్ తెలిపారు. వన్‌టౌన్ ఎస్ఐ తులసి శ్రీనివాసరావు చేతుల మీదుగా సొత్తును భద్రంగా బాధితులకు అందజేశారు. ఆటో డ్రైవర్ శాంతకుమార్ నిజాయితీని ప్రత్యేకంగా అభినందించారు.

# సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మె బాట

కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏఐటియుసి నాయకులు హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు తోర్లపాటి బాబు, కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, నాయకులు అప్పలరాజు మాట్లాడారు. ఒప్పంద, ఆప్కాస్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని, థర్డ్ పార్టీ కాంట్రాక్టు పద్ధతిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఖాళీలను భర్తీ చేసి పని భారం తగ్గించాలని కోరారు. సమస్యలు తీరకపోతే జూలై 7న జరిగే 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్@రూ.22.26 కోట్ల రాబడి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు రూ.22.26 కోట్ల రాబడి సమకూరింది. తిరుమల మినహా 21 ప్రధాన దేవాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. కేవలం మే నెలలోనే రూ.12.91 కోట్ల ఆదాయం రావడం విశేషం. భక్తులు తమ మొబైల్ నుంచే వాట్సాప్‌లో 'హాయ్' అని మెసేజ్ పంపి సులభంగా దర్శనం, సేవా టికెట్లు, తలనీలాల స్లాట్లు బుక్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆలయాల్లో 30 శాతం టికెట్లు దీని ద్వారానే బుక్ అవుతున్నాయి. శ్రీకాళహస్తి, అన్నవరం, శ్రీశైలం వంటి ఆలయాలకు దీని ద్వారా భారీ ఆదాయం లభించింది. భక్తుల రద్దీని తగ్గించేందుకు ఆలయాల వద్ద ప్రత్యేక 'మనమిత్ర సేవా కేంద్రాలు' మరియు క్యూలైన్లు కూడా ఏర్పాటు చేశారు.

# శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం మంగళగిరిలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండపై కొలువైన శ్రీ పానకాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి పానకం నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు ఉప ముఖ్యమంత్రికి వేదాశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను బహూకరించారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మంగళగిరి ఆలయాన్ని సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. భక్తులు, అభిమానులు ఆయనను చూసేందుకు తరలివచ్చారు.

# ఎల్బీనగర్‌లో దివ్యాంగురాలిపై అత్యాచారం

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దివ్యాంగురాలిపై అత్యాచారం జరిగిన దారుణ ఘటన వెలుగుచూసింది. బాధితురాలికి మాట్లాడే, వినే శక్తి లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఓ దుర్మార్గుడు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ దాడిలో మహిళ మెడ, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎల్బీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి, బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పట్టుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశామని, త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# హాస్టల్‌లో వాష్‌రూమ్‌లో యువతి ప్రసవం

హైదరాబాద్ గోల్కొండ ప్రాంతంలోని ఒక మహిళా హాస్టల్‌లో ఓ యువతి వాష్‌రూమ్‌లో ప్రసవించడం తీవ్ర కలకలం రేపింది. ప్రసవం అనంతరం ఆమె నవజాత శిశువును బాత్‌రూమ్ కిటికీ... వెంటిలేటర్ గుండా బయటకు విసిరివేసింది. ఈ ప్రమాదంలో శిశువు అక్కడికక్కడే మృతి చెందింది. యువతి గర్భవతి అనే విషయం హాస్టల్ సిబ్బంది గానీ, తోటి విద్యార్థినులు గానీ గుర్తించలేకపోవడం గమనార్హం. రక్తస్రావంతో ఉన్న యువతిని హాస్టల్ నిర్వాహకులు చికిత్స నిమిత్తం నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. శిశువు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామని, యువతి బావ పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

# మినిస్టర్ డయల్ యువర్ ఎమ్మెల్యే

రాష్ట్రంలో ప్రజల సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన నూజివీడు నియోజకవర్గ ప్రజల కోసం 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహించారు. గంటన్నరకు పైగా సాగిన ఈ ప్రత్యక్ష సంభాషణలో మంత్రి ప్రజల సమస్యలను ఓపికగా విని, వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. నూజివీడులో బైపాస్ రోడ్డు నిర్మాణం, మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో ఆధిపత్య రాజకీయాలు, అరాచకాలను సహించబోమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలోనే రికార్డు స్థాయిలో 4.51 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, డిసెంబర్ నాటికి మరో 4 లక్షల ఇళ్లను పూర్తి చేస్తామని మంత్రి పార్థసారథి వెల్లడించారు.

# నల్గొండలో సిటీ బస్ సర్వీసులు

నల్లగొండ పట్టణంలో ప్రజల సౌకర్యార్థం నూతన సిటీ బస్సు సర్వీసులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. మహిళలు, మెడికల్ కాలేజీ విద్యార్థుల రాకపోకల ఇబ్బందులను తొలగించేందుకు ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రూ.1.20 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. బస్టాండ్‌లో కొత్త కౌంటర్లు, వెయిటింగ్ హాళ్లు, టాయిలెట్లు, ఆధునిక ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నల్లగొండకు అదనంగా 30 బస్సులు కేటాయించామని, పట్టణాన్ని మోడల్ సిటీగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అనంతరం, కనగల్ మండలం ధర్వేశిపురంలో జరిగిన శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలలో మంత్రి పాల్గొన్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, దివ్య కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# విద్యుత్ శాఖలో వెయ్యి కోట్ల కుంభకోణం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమైందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇచ్చినట్లుగా కాకుండా, ఈ ప్రభుత్వం రైతుబంధు బకాయిలను నిలిపివేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం స్కామ్‌లు తప్ప స్కీమ్‌లు లేవని, 'కుసుమ' పథకంలో దాదాపు వెయ్యి కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు.

## సాయిబాబాపై వివాదం..

# మంత్రి క్లారిటీ

- భక్తుల విశ్వాసానికి భరోసా
- దుష్ప్రచారంపై ఆనం ఆగ్రహం



నిధుల కేటాయింపుపై స్పష్టత

సాయిబాబా ఆలయాల అంశంపై ఇటీవల తాను చేసిన వ్యాఖ్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. తన వ్యాఖ్యల అసలు ఉద్దేశాన్ని పక్కనపెట్టి కొన్ని వర్గాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఈ దుష్ప్రచారం వల్ల సాయిబాబా భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడటం బాధాకరమని పేర్కొన్నారు.తాను వ్యక్తిగతంగా సాయిబాబా భక్తుడినేనని మంత్రి స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఉదయం తన పూజా మందిరంలో వివిధ దేవతామూర్తులతో పాటు షిర్డీ సాయిబాబాను భక్తిశ్రద్ధలతో పూజించిన తర్వాతే దినచర్య ప్రారంభిస్తానని తెలిపారు. సాయిబాబాపై తనకు ఎంతో గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. తన వ్యాఖ్యల వల్ల ఏ భక్తుడైనా మనస్తాపానికి గురై ఉంటే క్షమించాలని కోరారు.

### ప్రభుత్వానికి వివక్ష ఉద్దేశం లేదు

రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ, తిరుమల తిరుపతి దేవస్థానాలు ఏ ఆరాధనా విధానంపైనా వివక్ష చూపే ఉద్దేశంతో పనిచేయడం లేదని మంత్రి వివరించారు. ప్రజలు ఆరాధించే మహనీయులను కించపరచే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. కోట్లాది మంది సాయిబాబా భక్తుల విశ్వాసాన్ని ప్రభుత్వం పూర్తిగా గౌరవిస్తుందని పేర్కొన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఐదు వేల భజన మందిరాల నిర్మాణ కార్యక్రమానికి ప్రత్యేక లక్ష్యం ఉందని మంత్రి వివరించారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ హిందూ దేవాలయాల నిర్మాణం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఈ పథకానికి సంబంధించిన నిధుల కేటాయింపు టీటీడీ మార్గదర్శకాలు, శ్రీవాణి ట్రస్టు నిబంధనల ప్రకారమే జరుగుతోందని వెల్లడించారు.

సాయిబాబా ఆలయాలకు ఈ పథకం కింద నిధులు అందకపోవడం అంటే సాయిబాబాను గానీ, ఆయన భక్తులను గానీ అవమానించడం కాదని మంత్రి తెలిపారు. నిధుల పంపిణీ పూర్తిగా ట్రస్టు లక్ష్యాలు, పరిపాలనా విధానాల ఆధారంగా జరుగుతుందని వివరించారు. ఇది ఎవరి విశ్వాసాన్ని తక్కువ చేసి చూడడం కాదని స్పష్టం చేశారు. మన సమాజంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పరమశివుడు, అమ్మవారు, అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా వంటి అనేక ఆరాధనా రూపాల పట్ల ప్రజలకు అపారమైన భక్తి ఉందని మంత్రి గుర్తు చేశారు. ప్రభుత్వం ఏ విశ్వాసాన్నీ కించపరచదని, ప్రతి భక్తుని మనోభావాలను గౌరవించడం తమ విధానమని చెప్పారు.

### దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

ఈ అంశాన్ని అనవసర వివాదంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భక్తి, విశ్వాసాలకు సంబంధించిన వివాదం కాదని, ట్రస్టుల లక్ష్యాలు, పరిపాలనా విధానాలకు సంబంధించిన అంశమని వివరించారు. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు ప్రతి భక్తుని విశ్వాసాన్ని గౌరవించడం కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న స్పష్టమైన విధానమని తెలిపారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మవద్దని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రెజెంట్ 'సర్'

## తెలంగాణలో నేటి నుంచి ఓటరు జాబితా ప్రక్షాళన

బడిలో టీచరు హాజరు తీసుకునేటప్పుడు పిల్లలు ప్రెజెంట్ టీచర్, ప్రెజెంట్ సర్ అంటారు కదా, ఈనెల 25వ తేదీ నుంచి ఎన్నికల కమిషన్ "సర్" (స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ) ప్రక్రియ కూడా ఒక విధంగా అలాంటిదే. నిజమైన ఓటర్లను కొనసాగిస్తూ, బోగస్ ఓట్లను ఏరివేయడానికి సర్ అవసరమే అని సుప్రీం కోర్టు ఇప్పటికే లైన్ క్లియర్ చేసింది. బీజేపీ మిత్రపక్షాలు కాని రాజకీయ పార్టీలన్నీ ఈ సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నాయి. ఇది ఓట్ చోరీ కోసమే అని ఆరోపిస్తున్నాయి. గతంలో ఈవీఎం లపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశాయి. కానీ ఇటీవల కేరళ, తమిళనాడు వంటి కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆ అరోపణల స్వరం భారీగా తగ్గింది. 2002నాటి ఓటర్ల జాబితా ఈ సర్ ప్రక్రియకు ప్రామాణికం. అందులో మీ పేరు ఉంటే ఆటోమేటిగ్గా తాజా లిస్టులో మీకు ఓటు హక్కు లభిస్తుంది. ఒకవేళ పేరు లేకపోయినా కొంపలు మునగవు. కొన్ని రకాల ఆధారాల్లో ఏదో ఒకటి చూపించడం ద్వారా మీరు భారతీయ ఓటరే అని రుజువు చేసుకోవచ్చు. అయితే ఇందుకు ఆధార్ కార్డు మాత్రం చెల్లదు. ఇప్పటి వరకు రాష్ట్రాల వారీగా "సర్" తొలగింపుల గణాంకాలు పరిశీలిస్తే.. బిహార్ 48 లక్షలు, బెంగాల్ 83.86 లక్షలు, ఉత్తర్ ప్రదేశ్ 2.04 కోట్లు, అస్సాం 2.43 లక్షలు, గుజరాత్ 68.12 లక్షలు, మధ్య ప్రదేశ్ 34.25 లక్షలు, ఛత్తీస్ గఢ్ 1.08 లక్షలు, రాజస్థాన్ 2.42 లక్షలు, తమిళనాడు 74.07 లక్షలు, కేరళ 9.06 లక్షలుగా ఉన్నాయి.

ఇంతకీ సర్ ప్రక్రియ బీజేపీ ఓట్ చోరీ కోసమేనా అంటే అవుననే అంటున్నాయి ప్రతిపక్షాలు. కాదని అంటున్నాయి వాస్తవాలు. బిహార్ లో ఐదుగురు ఓటర్లు మినహాయించి, ఈ సర్ ప్రక్రియ ద్వారా మృతులుగా పేర్కొంటూ ఓట్లు తొలగించిన వాళ్లెవ్వరూ తాము బతికున్నామని చెప్పిన దాఖలాలు లేవు. అలాగే, అక్రమంగా వలస వచ్చిన వారికి ఇది చెక్ పెట్టడానికి మంచి మార్గం అనేది ఎన్నికల కమిషన్ వాదన. ఒక వేళ విపక్షాల ఓట్ చోరీ ఆరోపణ నిజమైతే, ఇటీవల తమిళనాడులో బీజేపీ గెలిచి ఉండాలి. ఎందుకంటే ఆ రాష్ట్రంలో సర్ ద్వారా ఏకంగా 74.07 లక్ష ఓట్లను ఈసీ తొలగించింది. కానీ అక్కడ బీజేపీ కేవలం ఒక్క సీటే గెలిచింది. కేరళలోనూ బీజేపీ మూడు సీట్లకు పరిమితమైంది. ఇక, 83.86 లక్షల ఓట్లు తొలగించిన బెంగాల్ లో బీజేపీ ఘన విజయం సాధించింది. అక్కడ ఈసారి స్పష్టంగా హిందూ, ముస్లిం ప్రాతిపదికన ఎన్నికలు జరిగాయని అర్థమవుతుంది. హిందువుల జనాభా తక్కువగా ఉన్న నియోజకవర్గాల్లోనే ఇతర పార్టీలు గెలిచాయి. తొలగించిన ఓట్లలో ఎక్కువగా మృతులు, అక్రమ చొరబాటుదారులైన బంగ్లాదేశీయులవే అనేది బీజేపీ వాదన. తెలంగాణలో జూన్ 25 నుంచి ఇంటింటి సర్ సర్వే ప్రక్రియ మొదలవుతుంది. దీనిపై ఎన్ని విమర్శలు వస్తాయో, ఎన్ని వివాదాలు వెల్లువెత్తుతాయో చూద్దాం.

***– గోనె రాజేంద్ర ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్***

# అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు తగ్గినట్లేనా ?

స్విట్జర్లాండ్‌లో జరిగిన తొలి విడత అమెరికాఇరాన్ శాంతి చర్చలు సానుకూలంగా ముగిశాయి. ఖతర్, పాకిస్థాన్ దేశాల సంయుక్త మధ్యవర్తిత్వంలో ఈ ఉన్నత స్థాయి శాంతి చర్చలు జరిగాయి. రెండు అగ్ర దేశాల ప్రతినిధులు అంతర్జాతీయ శాంతి భద్రతలపై సుదీర్ఘంగా చర్చించారు. గత కొంతకాలంగా ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించడమే లక్ష్యంగా ఇవి సాగాయి.రాబోయే 60 రోజుల్లో ఒక ఫైనల్ డీల్ కుదుర్చుకునే రోడ్‌మ్యాప్‌పై ఇరుపక్షాలు అంగీకరించాయి. అంతర్జాతీయ సమాజం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణంలో ఈ పురోగతి లభించింది. మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు ఈ చర్చలు ఒక కీలక మైలురాయిగా మారుతాయని భావిస్తున్నారు. ముఖ్యంగా లెబనాన్‌లో కొనసాగుతున్న యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయడంపై ఇరు దేశాలు సానుకూలత వ్యక్తం చేశాయి. హింసను అరికట్టడం ద్వారా పౌరుల ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని ఇరు పక్షాలు అభిప్రాయపడ్డాయి. వ్యూహాత్మక ప్రాంతమైన హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల భద్రతపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ జలసంధి గుండా వెళ్లే నౌకలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అంతర్జాతీయ వాణిజ్యానికి ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని పరస్పరం నిర్ణయించుకున్నాయి. ఈ శాంతి ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తదుపరి సాంకేతిక స్థాయి చర్చలను వెంటనే ప్రారంభించనున్నారు.

రెండు దేశాల నిపుణుల కమిటీలు ఈ సాంకేతిక స్థాయి అంశాలపై సమగ్రంగా చర్చించనున్నాయి. ముందుగా అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తారు. ఈ చర్చల విజయవంతానికి మధ్యవర్తిత్వం వహించిన ఖతర్, పాకిస్థాన్ దేశాలు ఎంతో శ్రమించాయి. ఇరు దేశాల డిప్లొమాట్లు సంధి కుదిర్చేందుకు నిరంతరం రాయబారాలు నడిపారు. మొదటి విడత చర్చలు ఆశాజనకమైన వాతావరణంలో జరగడంపై అంతర్జాతీయ నిపుణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ఇరు దేశాల మధ్య ఉన్న కొన్ని దశాబ్దాల నాటి సంక్లిష్ట సమస్యలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. ముఖ్యంగా ఇరాన్ యొక్క వివాదాస్పద అణు కార్యక్రమంపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం రాలేదు. అణు ఒప్పందం పునరుద్ధరణ, ఆంక్షల ఎత్తివేతపై ఇరు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలాగే లెబనాన్‌లో నెలకొన్న ఇజ్రాయెల్‌హిజ్బుల్లా ఉద్రిక్తతలపై కూడా ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ ప్రాంతీయ ఉద్రిక్తతలు అంతర్జాతీయ శాంతికి సవాలుగా మారిన అంశాన్ని చర్చల్లో ప్రస్తావించారు. ప్రధానమైన మరియు వివాదాస్పదమైన ఈ అంశాలపై రాబోయే రోజుల్లో లోతుగా చర్చించనున్నారు. 60 రోజుల కాలపరిమితి లోగా వీటన్నింటికీ తగిన పరిష్కారం కనుగొనాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాజకీయంగా ఎన్నో సున్నితమైన అంశాలతో ముడిపడి ఉన్నందున ఈ డీల్ సవాలుతో కూడుకున్నదే. అయినప్పటికీ చర్చల ప్రక్రియను కొనసాగించేందుకే ఇరు దేశాల అధినేతలు సుముఖత వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన ఈ చర్చల వివరాలను అంతర్జాతీయ మీడియా ప్రముఖంగా ప్రసారం చేసింది. మధ్యప్రాచ్యంలో స్థిరత్వం ఏర్పడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుందని అంచనా. చమురు సరఫరా మార్గాలకు భద్రత లభిస్తే ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు నియంత్రణలోకి వస్తాయి. అమెరికా తన వైఖరిలో కొంత నెమ్మదించి, దౌత్య మార్గానికి ప్రాధాన్యత ఇవ్వడం విశేషం. ఇరాన్ కూడా అంతర్జాతీయ ఆంక్షల నుంచి ఉపశమనం పొందేందుకు ఈ చర్చలను వాడుకోవాలని చూస్తోంది. రెండు దేశాల అంతర్గత రాజకీయాలు కూడా ఈ శాంతి ఒప్పందంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల తదుపరి రౌండ్ చర్చలలో ప్రతి అడుగూ అత్యంత కీలకంగా మారనుంది. ఈ శాంతి రోడ్‌మ్యాప్ విజయవంతమైతే ఇరు దేశాల మధ్య కొత్త అధ్యాయం ప్రారంభమవుతుంది.

యుద్ధ వాతావరణం వీడి శాంతి వైపు అడుగులు పడటంపై ఐక్యరాజ్యసమితి సైతం హర్షం వ్యక్తం చేసింది. యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా ఈ చర్చల పురోగతిని నిశితంగా గమనిస్తున్నాయి. తదుపరి చర్చల వేదిక, తేదీలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. సాంకేతిక కమిటీల సమావేశాలు వచ్చే వారం నుంచే ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ లోపు ఇరు దేశాలు క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలు పెరగకుండా సంయమనం పాటించాల్సి ఉంటుంది. మధ్యవర్తిత్వ దేశాలు ఇరుపక్షాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉంటామని స్పష్టం చేశాయి. ఈ 60 రోజుల గడువు ఇరు దేశాల దౌత్య నీతికి మరియు చిత్తశుద్ధికి ఒక పెద్ద పరీక్ష లాంటిది. సమస్యల పరిష్కారానికి యుద్ధం ఒక్కటే మార్గం కాదని ఈ చర్చలు నిరూపిస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాంతి కాముకులు ఈ ఒప్పందం విజయవంతం కావాలని కోరుకుంటున్నారు. ఎలాంటి అవాంతరాలు ఎదురైనా చర్చల ప్రక్రియ ఆగిపోకూడదని మధ్యవర్తులు భావిస్తున్నారు. ఇరు దేశాల ప్రతినిధులు ఒకరినొకరు గౌరవించుకుంటూ చర్చలు జరపడం సానుకూల పరిణామం. రాబోయే రోజుల్లో కుదరబోయే ఫైనల్ డీల్ ప్రపంచ రాజకీయాల గమనాన్ని మార్చవచ్చు. అణు వ్యూహాలు, ప్రాంతీయ ఆధిపత్య పోరు పక్కన పెట్టి శాంతికి మొగ్గు చూపడం ఆహ్వానించదగ్గ విషయం. ఏది ఏమైనప్పటికీ స్విట్జర్లాండ్ చర్చలు అంతర్జాతీయ దౌత్య చరిత్రలో ఒక మంచి ముగింపును ఇచ్చాయి. రాబోయే 60 రోజుల్లో ఇరు దేశాల నడుమ చారిత్రాత్మక ఒప్పందం కుదురుతుందని అందరూ ఆశిస్తున్నారు.

**– పరమేశ్వర్ రుద్ర, సీనియర్ జర్నలిస్టు**

# కొలనుపాక నుండి కిడ్నీ నిపుణుడిగా

## డాక్టర్ క్రాంతి కుమార్ స్ఫూర్తి గాథ



వైద్య వృత్తికి కొత్త అర్థాన్ని, మానవీయ కోణాన్ని ఆవిష్కరించిన వ్యక్తి డాక్టర్ క్రాంతి కుమార్. నేటి సమాజంలో వైద్యం కేవలం ఒక వృత్తిగా కాకుండా, వ్యాపారంగా మారుతున్న తరుణంలో.. సామాన్యుడి ప్రాణాలను దైవంగా భావించి కాపాడే అరుదైన వైద్యులలో ఆయన ఒకరు. యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక వంటి చిన్న గ్రామం నుండి వచ్చి, తెలుగు మాధ్యమంలో చదువుకుని, తన పట్టుదలతో దేశంలోని అత్యున్నత వైద్య విద్యాసంస్థల్లో శిక్షణ పొంది నెఫ్రాలజీలో నిపుణుడిగా ఎదిగారు. ముఖ్యంగా మూత్రపిండాల వ్యాధులతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి రోగులకు ఆయన ఒక కొండంత భరోసా. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు సైతం అత్యంత నైపుణ్యంతో చికిత్స అందిస్తూ, వారిని మృత్యుంజయులుగా మారుస్తున్నారు. వైద్య సేవతో పాటు ఆధ్యాత్మికతను, ధ్యానాన్ని తన జీవితంలో భాగం చేసుకున్న డాక్టర్ క్రాంతి కుమార్, సేవయే పరమావధిగా జీవిస్తున్నారు. గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన యువతకు, తెలుగు మాధ్యమంలో చదివే విద్యార్థులకు ఆయన ఒక ఆదర్శవంతమైన స్ఫూర్తిప్రదాత. ఆయన జీవిత ప్రయాణం, రోగి పట్ల చూపే ఆప్యాయత ప్రతి వైద్యుడికి పాఠం.

### డాక్టర్ క్రాంతి కుమార్ మానవీయ ప్రస్థానం

"వైద్యో నారాయణో హరిః" అన్న వాక్యానికి నిజమైన అర్థం ఏంటో తెలియజేసే అరుదైన వ్యక్తిత్వం డాక్టర్ క్రాంతి కుమార్ ది. సమాజంలో వైద్యం వ్యాపారంగా మారుతున్న ఈ రోజుల్లో, వైద్యం అంటే కేవలం రోగాన్ని తగ్గించడం మాత్రమే కాదు, రోగికి భరోసానిచ్చి ప్రాణదానం చేయడమని ఆయన నిరూపిస్తున్నారు. అందరిలా ట్రీట్మెంట్ చేయడం కాదు.. ఎంత అవసరం ఉంటే అంతే చేయడం.. ఆయన స్పెషాల్టీ. తెలుగు రాష్ట్రాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఆయన ఒక ఆశాదీపంగా మారారు.

### పల్లెటూరిలో చిగురించిన ఆశ


యాదాద్రి భువనగిరి జిల్లా, చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొలనుపాక గ్రామం. సాధారణ మధ్యతరగతి కుటుంబం. తెలుగు మాధ్యమంలో చదువుకుంటూ, కళ్ళలో ఉన్నత కలలతో పెరిగిన ఒక సామాన్య విద్యార్థి క్రాంతి కుమార్. గ్రామీణ వాతావరణంలో, వసతులు తక్కువగా ఉన్నా.. పట్టుదల అనే ఆయుధాన్ని చేతబూని ఆయన ముందుకు సాగారు. తెలుగులో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోలేమన్న అపోహను పటాపంచలు చేస్తూ, తన అపారమైన మేధస్సుతో కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించారు.

### నిరంతర అధ్యయనం – అంకితభావం

అక్కడ మొదలైన ఆయన విద్యా ప్రయాణం అప్రతిహతంగా కొనసాగింది. వైద్య రంగంపై మక్కువతో కామినేని మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్‌లో ఎండీ పూర్తి చేశారు. అయితే, సమాజంలో పెరుగుతున్న మూత్రపిండాల.. కిడ్నీ సమస్యలను గమనించిన ఆయన, ఆ విభాగంలో ఎంతోమందికి సేవ చేయాలనే లక్ష్యంతో ఉస్మానియా మెడికల్ కాలేజీలో డీఎం నెఫ్రాలజీని పూర్తి చేశారు. కిడ్నీ వ్యాధులు అనగానే రోగులు భయపడి, నిర్లక్ష్యం చేస్తూ చివరి దశలో ఆసుపత్రికి వస్తుంటారు. అలాంటి క్లిష్టమైన కేసులను కూడా డాక్టర్ క్రాంతి కుమార్ గారు అత్యంత చాకచక్యంగా, సునాయాసంగా చికిత్స అందిస్తూ ఎందరో ప్రాణాలను కాపాడుతున్నారు.

### వైద్యం + ఆధ్యాత్మికత = సమతుల్య జీవనం

డాక్టర్ క్రాంతి కుమార్ ప్రత్యేకత కేవలం వైద్య విద్యలో ఉండటమే కాదు, ఆయనలో ఉన్న ఆధ్యాత్మిక కోణం కూడా. ఆయన 'ఆర్ట్ ఆఫ్ లివింగ్'కు అంకితభావం కలిగిన వ్యక్తి. ప్రతిరోజూ ధ్యానం, సేవ మరియు సాధనను తన జీవన శైలిలో భాగంగా చేసుకున్నారు. రోగిని కేవలం ఒక కేసుగా చూడకుండా, ఒక మనిషిగా చూస్తూ, చికిత్సతో పాటు మానసిక ధైర్యాన్ని అందించడంలో ఆయన సిద్ధహస్తులు. అందుకే ఆయన దగ్గరకు వెళ్ళిన రోగులు సగం వ్యాధి నయమైన అనుభూతిని పొందుతారు.



### నేటి యువతకు దిక్సూచి

ప్రస్తుతం హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో గల ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రోయూరాలజీలో నెఫ్రాలజీ నిపుణుడిగా ఆయన చేస్తున్న సేవలు అపారం. పల్లెటూరి నుండి వచ్చి, తెలుగు మాధ్యమంలో చదివి, నేడు అంతర్జాతీయ స్థాయి వైద్యుడిగా ఎదగడం, మధ్యతరగతి యువతకు ఆయన ఒక గొప్ప స్ఫూర్తి. "పట్టుదల, క్రమశిక్షణ, సేవ చేసే గుణం ఉంటే.. ఏ



# సర్ యుద్ధం



- ఎందుకు? ఏమిటి? ఎలా?
- ప్రత్యేక సవరణ కార్యక్రమం
- లాభం ఎవరికి? నష్టం ఎవరికి?
- ఓటరు ప్రక్షాళనతో కొత్త చిక్కులు
- ఓటు హక్కు రక్షణ కోసం పోరాటం
- జాబితా ప్రక్షాళనకు రంగం సిద్ధం

**రాష్ట్రంలో నేటి నుంచి జరగనున్న ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) ప్రక్రియ సామాన్య ఓటరుకు ఒక పెద్ద పరీక్షగా మారింది. ఓటరు జాబితాను శుభ్రం చేయాలనే ప్రభుత్వ సంకల్పం మంచిదే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇది అనేక ఆందోళనలకు దారితీస్తోంది. దశాబ్దాల క్రితం నాటి పాత రికార్డులను వెలికితీయడం, నిరక్షరాస్యులైన ప్రజలు వెబ్‌సైట్లలో తమ వివరాలను శోధించడం ఒక ప్రహసనంగా మారింది. ముఖ్యంగా అద్దె ఇళ్లలో ఉంటూ తరచూ నివాసాలు మార్చే సామాన్యులు, వలస కార్మికులు ఈ నిబంధనల వల్ల తమ ఓటు హక్కును కోల్పోతామేమోననే భయాందోళనల్లో ఉన్నారు. మరోవైపు, ఈ విధానం వల్ల సామాన్యుడి దైనందిన జీవితంలో ఒక రకమైన మానసిక సంఘర్షణ మొదలైంది. ప్రభుత్వ రికార్డుల్లో దొర్లిన తప్పుల వల్ల ఒకే కుటుంబంలో వయస్సు వ్యత్యాసాలు విపరీతంగా చూపించడం గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఈ తప్పులను సరిదిద్దుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాలా లేక కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలా అనే స్పష్టత లేకపోవడం ప్రజలను తీవ్ర అయోమయానికి గురిచేస్తోంది. ఓటు హక్కును కాపాడుకునే క్రమంలో సామాన్యుడు ఎదుర్కొంటున్న ఈ ఆటంకాలు ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక సవాలుగా నిలుస్తున్నాయి.**

**రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రక్షాళన కోసం ఎన్నికల సంఘం ఒక ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిని ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) అని పిలుస్తారు. ఈ ప్రక్రియ ఓటర్లలో తీవ్ర ఆసక్తిని, కొన్ని అనుమానాలను రేకెత్తిస్తోంది. అధికారులు ఈ కార్యక్రమాన్ని ఓటరు జాబితాను శుభ్రం చేసే సాధారణ ప్రక్రియగా అభివర్ణిస్తున్నారు. రాజకీయ పార్టీలు, సామాన్య ప్రజలు దీని అమలు తీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఓటరు జాబితాలో ఉండే తప్పులను సరిదిద్దడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఉన్న ఓటరు వివరాలను పాత రికార్డులతో పోల్చి చూడటం ఈ సవరణలో అత్యంత కీలకమైన అంశం.**

### • ప్రత్యేక సవరణ అంటే ఏమిటి?

ప్రత్యేక సవరణ అనేది ఓటరు జాబితాలను పూర్తిగా కొత్తగా ఉపయోగించే ఒక ప్రత్యేక పద్ధతి. భారత ఎన్నికల సంఘం దేశంలో ఇప్పటివరకు ఎనిమిది సార్లు ఈ విధమైన సవరణలను నిర్వహించింది. రాష్ట్రంలో చివరిసారిగా ఇటువంటి భారీ సవరణ ప్రక్రియ 2002 సంవత్సరంలో జరిగింది. గతంలో ప్రతి ఒక్కరి డేటాను మొదటి నుండి సేకరించేవారు. సాంకేతికత పెరిగిన తర్వాత పాత డేటాకు మార్పులు చేస్తూ కొత్త జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఈసారి రికార్డులను తనిఖీ చేయడానికి 2002 నాటి ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోవడం గమనార్హం.

### • ఈ సవరణ ఎందుకు అవసరమైంది?

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అత్యంత విలువైనది. ఒకే వ్యక్తి పేరు రెండు మూడు చోట్ల నమోదు కావడం, చనిపోయిన వారి పేర్లు జాబితాలో అలాగే కొనసాగడం వంటి సమస్యలను నివారించడానికి ఈ ప్రక్షాళన అవసరమైంది. సాధారణంగా జరిగే సంక్షిప్త సవరణల కంటే ఇది పూర్తిగా భిన్నమైనది. ఈ ప్రక్రియలో అధికారులు ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి వివరాలను సేకరిస్తారు. దీనివల్ల నకిలీ ఓట్లను తొలగించడం సులువవుతుంది. నిజమైన ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ భారీ కసరత్తు వెనుక ఉన్న అసలు లక్ష్యం.

### • క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఎలా జరుగుతుంది?

ఈ ప్రత్యేక సవరణ కోసం బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) రంగంలోకి దిగుతున్నారు. అధికారులు ముందుగానే ముద్రించిన ఫారాలను తీసుకొని ప్రతి ఇంటి తలుపు తడతారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ ఇండ్ల సందర్శన కార్యక్రమం జూన్ 25 నుండి ప్రారంభమై జూలై 24 వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. సుమారు వెయ్యి మంది ఓటర్లకు ఒక అధికారి చొప్పున కేటాయించారు. ప్రతి అధికారి ఒక ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించాల్సి ఉంటుంది. మొదటిసారి ఫారాలు ఇవ్వడానికి, రెండోసారి వాటిని పూరించడంలో సహాయం చేయడానికి, మూడోసారి పూర్తి చేసిన పత్రాలను సేకరించడానికి వారు వస్తారు. 2002 ఓటరు జాబితాతో ప్రస్తుత వివరాలను అనుసంధానం చేయడం ఈసారి తప్పనిసరి చేశారు.

### • ఆన్‌లైన్ దరఖాస్తులు, ముసాయిదా విడుదల

ఆన్‌లైన్ దరఖాస్తులు, ముసాయిదా విడుదలకొత్తగా ఓటు హక్కు పొందాలనుకునే వారి కోసం అధికారులు ప్రత్యేకంగా ఫారమ్ 6 అందిస్తారు. ప్రజలు ఈ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా కూడా పూర్తి చేసే అవకాశం ఉంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ అందుబాటులో ఉంచింది. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేటప్పుడు ఓటరు పేరు ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లో ఉన్న విధంగా సమానంగా ఉండాలి. ఇండ్ల వారీగా ఫారాల సేకరణ పూర్తయిన తర్వాత జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు తెలపడానికి ప్రజలకు ఆగస్టు 30 వరకు సమయం ఇస్తారు. అన్ని రకాల క్లెయిములను పరిశీలించిన తర్వాత అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను అధికారికంగా విడుదల చేస్తారు.

### • నోటీసుల జారీ, పాత రికార్డుల శోధన

జూలై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు ఉన్న సమయాన్ని నోటీసుల కాలంగా పరిగణిస్తారు. వివరాలు సరిపోలని వారికి, తప్పులు ఉన్న వారికి రిజిస్ట్రేషన్ అధికారులు నోటీసులు జారీ చేస్తారు. నోటీసులు అందుకున్న వారు నిర్ణీత సమయంలో సరైన ఆధారాలతో అధికారిని కలిసి తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాలి. ముందస్తు మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా 2002 రికార్డులతో వివరాలు సరిపోలిన వారు ఎలాంటి అదనపు పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ పాత వివరాలను వెబ్‌సైట్లలో వెతుక్కోవచ్చు. ఒకవేళ సొంత పేరు కనిపించకపోతే తల్లిదండ్రుల లేదా తాతల వివరాలను ఉపయోగించి రికార్డులను వెలికితీయవచ్చు. క్షేత్రస్థాయి అధికారుల వద్ద కూడా ఈ పాత రికార్డుల ప్రతి లభిస్తుంది.

### • రాజకీయ పార్టీల ఆందోళనలు, సవాళ్లు

ఈ నూతన ప్రక్రియపై రాజకీయ పార్టీలు కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. ఓటరు జాబితాలో వయస్సు వ్యత్యాసాలు, పేర్ల స్పెల్లింగ్ తప్పులు వంటి అనేక విచిత్రమైన లోపాలు ఉన్నట్లు వారు గుర్తిస్తున్నారు. తండ్రికి కొడుకుకు మధ్య కేవలం పదిహేనేళ్ల వయస్సు తేడా ఉన్నట్లు రికార్డుల్లో నమోదు కావడం వంటి ఉదాహరణలను వారు చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఇతర గుర్తింపు పత్రాలను కూడా దీనికి అనుమతించాలని కోరుతున్నారు. అద్దె ఇండ్లలో ఉంటూ తరచూ నివాసాలు మార్చే సామాన్యులకు ఈ నిబంధనలు పెద్ద సవాలుగా మారాయి. వెబ్‌సైట్లలో పాత వివరాలను వెతకడం కూడా చాలా మందికి కష్టంగా మారింది. ఈ తప్పులను సరిదిద్దడానికి ఫారమ్ 8 ఉపయోగించాలా లేక కొత్త ఓటరుగా దరఖాస్తు చేయాలా అనే విషయంలో స్పష్టత కరువైంది.

# సర్ విషయంలో బీకేర్ ఫుల్

- »నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించం
- »అప్రమత్తంగా ఉండండి..
- »పనిచేయని వారిని వదులుకుంటాం
- »బాధ్యత లేని నాయకులను తప్పించేస్తాం
- »సర్‌తో బీజేపీ రాజకీయ కుట్రలు
- »సీఎం రేవంత్ ఘాటు హెచ్చరిక



తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత అప్రమత్తమైంది. ఈ ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా సహించే ప్రసక్తి లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు అత్యంత ఘాటుగా హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైన ఆయుధమని, దాన్ని కాపాడుకోవడంలో నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో విఫలమైతే ఎంతటి వారినైనా పక్కన పెట్టడానికి వెనకాడబోమని ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు.

### • జూమ్ మీటింగ్‌లో సీఎం ఆగ్రహం

ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం ఒక ముఖ్యమైన జూమ్ సమావేశాన్ని నిర్వహించింది. ఈ భేటీలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, చాలా మంది ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు దిశానిర్దేశం చేసినా క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పు రాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### • వారం రోజులే గడువు

పనిచేయని నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధులకు కేవలం వారం నుండి పది రోజుల సమయం మాత్రమే ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ లోపు వారి తీరులో మార్పు రాకపోతే, వారి స్థానంలో చురుగ్గా పనిచేసే ఇతర నాయకులను నియోజకవర్గ ఇన్‌చార్జులుగా నియమిస్తామని స్పష్టం చేశారు. పార్టీ కంటే ఎవరూ ఎక్కువ కాదని, పనిచేయని వారు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. అవసరమైతే తనకు ఒక నియోజకవర్గం కేటాయిస్తే తానే స్వయంగా వెళ్లి గ్రౌండ్ లెవల్‌లో పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని సీఎం ప్రకటించారు.

### • ప్రతిపక్షాల కుట్రలపై అప్రమత్తత

ఈ ఓటరు జాబితా సవరణ వెనుక ప్రతిపక్ష బీజేపీ పెద్ద రాజకీయ కుట్రకు తెరతీస్తోందని ముఖ్యమంత్రి ఆరోపించారు. లౌకికవాద ఓట్లను, కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండే సామాన్య ప్రజల ఓట్లను జాబితా నుండి తొలగించే ప్రయత్నాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో గతంలో జరిగిన పరిణామాలను ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. ఈ రాజకీయ వ్యూహాలను తిప్పికొట్టకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ నియోజకవర్గాల్లోనే ఉంటూ ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

### • మంత్రులకు సైతం తప్పని బాధ్యత

ఈ కీలకమైన బాధ్యత కేవలం ఎమ్మెల్యేలకు మాత్రమే పరిమితం కాదని, ఇన్‌చార్జ్ మంత్రులు కూడా దీనికి పూర్తి బాధ్యత వహించాలని సీఎం స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఎవరు పని చేస్తున్నారు, ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నారనే పూర్తి నివేదిక తన వద్ద ఉందని ఆయన వెల్లడించారు. పద్ధతి మార్చుకోకపోతే తదుపరి సమావేశంలో అందరి పేర్లను బహిరంగంగా చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. మంత్రులు సైతం తమ జిల్లాల్లో పర్యవేక్షణ లోపిస్తే వారిని కూడా మార్చడానికి వెనకాడబోమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### • బలహీన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలోని గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్ వంటి నియోజకవర్గాల్లో పార్టీ యంత్రాంగం బలహీనంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండటం సరికాదన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడటం బూత్ స్థాయి ఏజెంట్ల ప్రధాన విధి అని చెప్పారు. ఓటు హక్కు అనేది కేవలం రాజకీయం కోసం మాత్రమే కాదని, అది మనిషికి ఆక్సిజన్ లాంటిదని, సమాజంలో ఒక గుర్తింపు అని మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. ఎంతో పోరాడి సాధించుకున్న ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.

# సర్ బూచి.. రేషన్ నిరాకరణ

## బెంగాల్ సర్కార్ నిర్ణయంపై సుప్రీంకోర్టు విస్మయం

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సాకుగా చూపి పేదలకు రేషన్ నిరాకరించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనంగా మారింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లభించే ఉచిత రేషన్, అన్నపూర్ణ యోజన వంటి సామాజిక సంక్షేమ పథకాలను ఓటరు జాబితాతో అనుసంధానం చేయడాన్ని ఒక స్వతంత్ర వ్యవసాయ కార్మిక సంఘం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఓటరు జాబితా నుండి పేర్లు తొలగించబడిన కారణంతో పేదలకు అందే ఆహార భద్రతను దూరం చేయడం చట్టవిరుద్ధమని కార్మిక సంఘాలు బలంగా వాదిస్తున్నాయి. ఈ వివాదంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు తీవ్ర ఆశ్చర్యం వ్యక్తంచేసింది.

### • వివాదానికి కారణమైన ప్రభుత్వ ఉత్తర్వులు

పశ్చిమ బెంగాల్ ఆహార, పౌర సరఫరాల శాఖ జూన్ 4న జారీ చేసిన ఒక వివాదాస్పద ఉత్తర్వు ఈ మొత్తం గందరగోళానికి కేంద్ర బిందువుగా మారింది. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో అర్హత కోల్పోయినట్లు తేలిన వారిని రేషన్ లబ్ధిదారుల జాబితా నుండి కూడా తక్షణమే తొలగించాలని అందులో పేర్కొన్నారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారు, వేరే ప్రాంతాలకు వలస వెళ్ళిన వారు, నకిలీ ఓటర్లుగా గుర్తించిన వారి పేర్లను రేషన్ కార్డుల నుండి తొలగించాలని అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. కేవలం 12 రోజుల వ్యవధిలోనే బూత్‌ల వారీగా లబ్ధిదారుల ఏరివేత ప్రక్రియను పూర్తి చేయాలని రాత్రికి రాత్రే గడువు విధించడం కలకలం రేపింది.

### • సుప్రీంకోర్టు విస్మయం, హైకోర్టుకు సూచన

ఈ వ్యవహారంపై బుధవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నుంచి పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అయితే, ఇది ఒక రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరగా, న్యాయస్థానం దానికి స్వేచ్ఛనిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

### • చట్టపరమైన హక్కులపై కార్మిక సంఘాల పోరాటం

జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 ప్రకారం దేశంలోని ప్రతి పౌరుడికి ఆహారం పొందే చట్టపరమైన హక్కు ఉందనే విషయాన్ని కార్మిక సంఘాలు గుర్తుచేస్తున్నాయి. ఒక ప్రభుత్వ నిబంధన ద్వారా ఆ ప్రాథమిక హక్కును లాక్కోవడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు కోర్టులో వాదించారు. గతంలో బీహార్ రాష్ట్రానికి సంబంధించిన ఒక కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా వారు ప్రస్తావించారు. ఓటరు జాబితా సవరణ అనేది కేవలం ఎన్నికల ప్రక్రియకు మాత్రమే పరిమితం కావాలని, దానిని సంక్షేమ పథకాలకు ముడిపెట్టి పేదల పొట్ట కొట్టడం సమంజసం కాదని వ్యవసాయ కార్మిక సంఘం స్పష్టం చేసింది.




### అన్నపూర్ణ యోజనపై లబ్ధిదారుల ఆందోళన

గత ప్రభుత్వ హయాంలో మహిళల కోసం విజయవంతంగా అమలు చేసిన లక్ష్మీర్ భండార్ పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం అన్నపూర్ణ యోజనగా మార్చింది. ఈ పథకం కింద ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రెట్టింపు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హుల ఎంపిక కోసం ఏకంగా 11 పేజీల దరఖాస్తు ఫారమ్‌ను ప్రవేశపెట్టడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఓటరు జాబితాలో సాంకేతిక లోపాలు ఉన్నాయనే నెపంతో లక్షలాది మంది నిరుపేద మహిళలను ఈ పథకానికి దూరం చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

### లబ్ధిదారుల సంఖ్య సగానికి తగ్గింపు ఆందోళన

రాష్ట్ర బడ్జెట్‌లో అన్నపూర్ణ యోజన పథకానికి 36,000 కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ బడ్జెట్ అంచనాల ప్రకారం గతంలో లక్ష్మీర్ భండార్ పథకం ద్వారా లబ్ధి పొందిన 2.2 కోట్ల మంది మహిళల సంఖ్య ఇప్పుడు కేవలం కోటి మందికి పడిపోనుంది. అంటే దాదాపు సగం మందికి పైగా మహిళలకు ఈ పథకం దూరం కానుంది. పాత ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో దాదాపు 91 లక్షల మంది ఓట్లు తొలగించగా, అందులో 34 లక్షల మంది పౌరులు తమ ఓట్ల పునరుద్ధరణ కోసం ట్రిబ్యునళ్లను ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తున్నారు.







# మూడు ఫార్మాట్లకు విడివిడి జట్లు

## పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం

పాకిస్థాన్ క్రికెట్ లో భారీ మార్పులకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, జాతీయ సెలెక్టర్లు శ్రీకారం చుట్టారు. ఆధునిక క్రికెట్ అవసరాలకు అనుగుణంగా టెస్టులు, వన్డేలు, టీ20 ఫార్మాట్లకు విడివిడి జట్లను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టులలో ఫార్మాట్ల వారీగా వర్గీకరణను మొదటి దశగా అమలు చేస్తున్నారు. ఈ విషయమై పీసీబీ సీనియర్ సెలెక్టర్ ఆకిబ్ జావేద్ మాట్లాడుతూ.. ఒకే తరహా ఆటగాళ్లు అన్ని ఫార్మాట్లకు సరిపోరని, ముఖ్యంగా టెస్ట్, టీ20 జట్లను వెంటనే వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం టెస్ట్ మ్యాచ్ లు మాత్రమే ఆడే స్పెషలిస్ట్ ఆటగాళ్లు నష్టపోకుండా ఉండేందుకు ఈ నూతన విధానాన్ని తెచ్చినట్లు పేర్కొన్నారు. టెస్టుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే ఆటగాళ్లకు నెలకు 40 లక్షల పాకిస్థానీ రూపాయల వరకు వేతనం లభిస్తుందని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ప్రతి ఫార్మాట్ కు పూర్తిస్థాయిలో ప్రత్యేకమైన జట్లు ఉంటాయని స్పష్టం చేశారు.



# వైభవ్ సూర్యవంశీకి ప్రత్యేక చేంజింగ్ రూమ్

## ఇంగ్లాండ్ పర్యనటలో బీసీసీఐ ఏర్పాట్లు

భారత క్రికెట్ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ సీనియర్ భారత జట్టుతో కలిసి ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులతో అత్యధిక స్కోరర్‌గా నిలిచిన సూర్యవంశీ, ఈ పర్యటనలో అరంగేట్రం చేస్తే అత్యంత పిన్న వయస్కుడైన భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించనున్నాడు. అయితే, బ్రిటీష్ మీడియా నివేదికల ప్రకారం.. ఇంగ్లాండ్ పర్యటనలో వైభవ్‌కు ప్రత్యేక చేంజింగ్ రూమ్ కేటాయించనున్నారు. ఐసీసీ, ఈసీబీ నిబంధనల ప్రకారం 16 ఏళ్లలోపు ఆటగాళ్లు పెద్దల చేంజింగ్ రూమ్‌లను ఉపయోగించకూడదు. ఈ 'సేఫ్‌గార్డింగ్' నిబంధనల కారణంగానే అతనికి అన్ని వేదికల్లో ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. మ్యాచ్ సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండేందుకు, జట్టు సమావేశాల్లో పాల్గొనేందుకు అతనికి అనుమతి ఉంటుంది. కేవలం బట్టలు మార్చుకునే సమయంలోనే ఈ నిబంధన వర్తిస్తుంది. కాగా, అతను చిన్నపిల్లవాడు కావడం వల్ల ఈ పర్యటనలో అతని తల్లిదండ్రులు కూడా వెంట ఉండేందుకు బీసీసీఐ ప్రత్యేక అనుమతిని ఇచ్చింది.






# నిబంధనల ఉల్లంఘన వ్యవహారం

## సహచరులకు బెన్ స్టోక్స్ క్షమాపణలు

జట్టు నిబంధనలను, ప్రోటోకాల్స్ ఉల్లంఘించడం వల్ల న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టుకు దూరమైన ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్.. ఈ ఘటనపై తన సహచర ఆటగాళ్లకు క్షమాపణలు చెప్పారు. లార్డ్స్‌లో జరిగిన మొదటి టెస్టు విజయం తర్వాత ఒక నైట్ క్లబ్ ఘటన, కర్ఫ్యూ నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను స్టోక్స్‌తో పాటు పేసర్ గస్ అట్కిన్సన్‌పై ఈసీబీ విచారణ జరిపి, లిఖితపూర్వక హెచ్చరిక జారీ చేసింది. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో స్టోక్స్ మాట్లాడుతూ.. "ఒక కెప్టెన్‌గా నేను ముందుగా జట్టుకు క్షమాపణలు చెప్పాను. నా ప్రవర్తన వల్ల జట్టుతో పాటు కొత్తగా అరంగేట్రం చేసిన ఆటగాళ్లపై కూడా ప్రభావం పడింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత తీసుకోవడం ముఖ్యం" అని పేర్కొన్నారు. గురువారం నుండి ప్రారంభం కానున్న సిరీస్ నిర్ణయాత్మక మూడో టెస్టుకు స్టోక్స్ తిరిగి జట్టులోకి వచ్చి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడంపైనే ప్రస్తుతం తమ దృష్టి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# నేను కెప్టెన్, కేకేఆర్ కోచ్‌గా గ్రెగ్ చాపెల్

## సౌరవ్ గంగూలీ సంచలన వ్యాఖ్యలు



భారత క్రికెట్ చరిత్రలోనే అత్యంత వివాదాస్పదమైన గ్రెగ్ చాపెల్‌సౌరవ్ గంగూలీ ఎపిసోడ్‌పై 'దాదా' ఒక సంచలన విషయాన్ని బయటపెట్టారు. 2000వ దశకం మధ్యలో తనను జట్టు నుండి తప్పించడంలో కీలక పాత్ర పోషించిన చాపెల్, ఆ తర్వాత ఒక ఐపీఎల్ సీజన్ కోసం తనను సంప్రదించారని గంగూలీ వెల్లడించారు. తాజాగా ఒక పాడ్‌కాస్ట్‌లో గంగూలీ మాట్లాడుతూ.. "నేను కేకేఆర్ కెప్టెన్‌గా ఉన్నప్పుడు, 2011లో గ్రెగ్ చాపెల్ నుండి నాకు ఒక ఈమెయిల్ వచ్చింది. నేను కెప్టెన్‌గా ఉంటే, ఆయన కేకేఆర్ జట్టుకు కోచ్‌గా పనిచేయాలని అనుకుంటున్నట్లు అందులో రాశారు. అది చూసి నేను ఆశ్చర్యపోయాను" అని పేర్కొన్నారు. అయితే ఆ మెయిల్‌కు తాను ఎలాంటి సమాధానం ఇవ్వలేదని గంగూలీ స్పష్టం చేశారు. నిజాయితీ లేని వ్యక్తులకు తాను జవాబు ఇవ్వనని, ఒకసారి మోసపోయిన తాను మళ్లీ మూర్ఖుడిలా మారదలచుకోలేదని వ్యాఖ్యానించారు. ఈ వెల్లడి ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

# షోయబ్ అక్తర్ కుటుంబంలో విషాదం

- అన్న షాహిద్ అక్తర్ కన్నుమూత



పాకిస్థాన్ దిగ్గజ క్రికెటర్ షోయబ్ అక్తర్ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆయన పెద్దన్నయ్య షాహిద్ అక్తర్ బుధవారం మరణించారు. ఈ విషయాన్ని అక్తర్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులు వెల్లడించలేదు. పాకిస్థాన్ మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ కూడా ఈ వార్తను ధృవీకరిస్తూ ఫేస్‌బుక్‌లోసంతాపం ప్రకటించారు. అంత్యక్రియల వివరాలను త్వరలోనే తెలియజేస్తామని అక్తర్ పేర్కొన్నారు. సుమారు ఐదేళ్ల క్రితమే అక్తర్ తల్లి కన్నుమూయగా, ఇప్పుడు అన్న మరణంతో ఆయన కుటుంబం మరోసారి కోలుకోలేని శోకంలో మునిగిపోయింది. అక్తర్ అన్న మృతి పట్ల పలువురు మాజీ క్రికెటర్లు, అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# చరణ్‌పై మోడీ ప్రశంసలతో పులకించా

## ఎక్స్ వేదికగా చిరంజీవి ఆనందోత్సాహం




మెగాస్టార్ చిరంజీవి తన కుమారుడు రామ్ చరణ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల 'పెద్ది' సినిమాతో సూపర్ హిట్‌ను అందుకుని టాప్ ట్రెండింగ్‌లో ఉన్న రామ్ చరణ్ రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గెస్ట్‌గా పాల్గొన్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించారు. దీనిపై చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ సుమతీ శతక పద్యంతో తన పోస్ట్‌ను ప్రారంభించారు. 'పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడే పుట్టదు, జనులా పుత్రుని గనుగొని పొగడగా, పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ'. అని రాస్తూ కొడుకు పుట్టగానే తండ్రికి నిజమైన సంతోషం కలగదని, సమాజంలో ఆ కొడుకు గొప్పతనాన్ని చూసి జనాలు మెచ్చుకున్నప్పుడే ఆ తండ్రికి నిజమైన ఆనందం కలుగుతుందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో రామ్ చరణ్‌ను న్యూ ఏజ్ మెగాస్టార్ అని సంబోధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని చిరంజీవి తెలిపారు. ఇలాంటి ప్రతిష్టాత్మక వేదికలపై చరణ్‌కు లభిస్తున్న గుర్తింపు, గౌరవం చూస్తుంటే ఒక తండ్రిగా గర్వంగా ఉందన్నారు. తన కృషి, అంకితభావం, నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా విశేషమైన గుర్తింపును కూడా సంపాదించుకోవడం నిజంగా సంతోషకరమని పేర్కొన్నారు.

# మాట్లాడినా..మాట్లాడకున్నా తప్పే..అవుతోంది

## ధర్మన్ సినిమా లాంచ్‌లో రజనీకాంత్ ఆవేదన


తనపై జరుగుతున్న ట్రోలింగ్ గురించి అసహనం వ్యక్తం చేశాడు నటుడు సూపర్ స్టార్ రజనీకాంత్. తాజాగా చెన్నైలో జరిగిన 'ధర్మన్' సినిమా లాంచ్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, బహిరంగంగా మాట్లాడాలంటే ఇప్పుడు భయంగా ఉందని చెప్పారు. తాను మాట్లాడినా సమస్యే, మౌనంగా ఉన్నా సమస్యే అవుతోందని రజినీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. వేదికపైకి మాట్లాడమని పిలిస్తే భయంగా ఉందని, ఎందుకంటే తాను మాట్లాడితే అది తనకు కాకపోయినా మీకు సమస్య అవుతుందని ఆయన అన్నారు. ఒకవేళ మౌనంగా ఉంటే మౌనంగా ఎందుకు ఉన్నాడు అని ఎగతాళి చేస్తారని చెప్పారు. అదే మాట్లాడితే ఇప్పుడు ఎందుకు మాట్లాడాడు, అసలు మాట్లాడకుండా ఉండాల్సింది అని విమర్శిస్తారని తెలిపారు. ఇక చాలా ఏళ్ల తర్వాత తనకు ఒక విషయం అర్థమైందని, మనల్ని ఇష్టపడని వాళ్లకు మనం ఏం చేసినా నచ్చదని, ఇష్టపడేవాళ్లు మనం ఏం చేసినా నచ్చుతుందని అనుకోవడం మూర్ఖత్వమని రజినీ అన్నారు. ప్రతి ఒక్కరూ మనల్ని మెచ్చుకుంటారని ఆశించడం సరికాదని, జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రజినీకాంత్ 'ధర్మన్' చిత్ర షూటింగ్ గురువారం నుంచి ప్రారంభించబోతున్నారు. ఈ సినిమాను కమల్ హాసన్ నిర్మిస్తుండగా అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించబోతున్నాడు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు సూపర్‌స్టార్ రజినీకాంత్ బహిరంగంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదంటూ సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై రజినీకాంత్ స్పందించారు. 'ధర్మన్' లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ వివాదానికి తెరదించారు.






# శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో ఈత

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఈత' అధికారిక టీజర్ విడుదలైంది. 'ఛావా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ బయోపిక్ డ్రామాకు దర్శకత్వం వహిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద, లావణి నృత్య కళాకారిణి విఠాబాయి నారాయణగాంకర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రణదీప్ హుడా కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో శ్రద్ధా కపూర్ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. గర్భవతిగా ఉండి కూడా స్టేజ్ పై నృత్యం చేయడం, ప్రసవ వేదన అనుభవిస్తూనే కళ కోసం రంగస్థలంపైకి రావడం వంటి భావోద్వేగ సన్నివేశాలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. 'మంచంపై పడి చనిపోతే నన్ను ఒక నిస్సహాయురాలిగా గుర్తుంచు కుంటారు. అదే నృత్యం చేస్తూ చనిపోతే ఒక చరిత్రగా నిలిచిపోతాను' అంటూ శ్రద్ధా కపూర్ చెప్పే డైలాగ్ రోమాలు నిక్కబొడుస్తున్నాయి. ఇక ఈ చిత్రం 2026 ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది.





# గాసిప్ సినిమా చూడాల్సిందే

మనం సరదాగా మాట్లాడే మాటలు ఇతరుల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తాయో తెలియాలంటే మా 'గాసిప్' సినిమా చూడాల్సిందే' అంటున్నారు దర్శకుడు వైభవ్ కౌండిన్య. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో రాశీ సింగ్ ప్రధాన పాత్ర పోషించగా.. యతి రేమెళ్ల నిర్మించారు. రవివర్మ, మహేశ్ యడ్లపల్లి, పృథ్వీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 26న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సాయికిరణ్ అడివి ఇటీవల హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వైభవ్ కౌండిన్య మాట్లాడుతూ.. 'మాటకు చాలా శక్తి ఉంది. ఒక మాట మనిషిని నిలబెట్టగలదు. అదే మాట అతడిని కూల్చగలదు. అందుకే ఇతరుల గురించి మాట్లాడేటప్పుడు బాధ్యత ఉండాలని సందేశాన్నిచ్చే చిత్రమిది. నా జీవితంలో.. నా మిత్రుల జీవితాల్లో జరిగిన కొన్ని నిజ సంఘటనలు దీంట్లో ఉన్నాయి. ఇదొక మంచి భావోద్వేగభరిత ప్రయాణం. కచ్చితంగా అందర్నీ ఆలోచింపజేస్తుంది' అన్నారు. 'ఇది నాకెంతో ప్రత్యేకమైన సినిమా. ఒక చిన్న గాసిప్ ఓ వ్యక్తి జీవితాన్ని ఎలా తలకిందులు చేస్తుందో చూపించే కథ. దీన్ని థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నా' అన్నారు నటి రాశీ సింగ్.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com